# ఛాయ

"స్వాతి" సపరివారపత్రిక
(పెద్దకథ)

---

"మన జీవితాల్ని ఎవరో వచ్చి బాగుచేయరు
మన జీవితాల్ని మనమే బాగుచేసుకోవాలి"
"ఆవేశం, ఆత్మగౌరవం పేరిట భర్తని వదిలేసి
జీవితాన్ని కోల్పోవడం తెలివిగల పనికాదు"

- జయప్రద

---

"ఛాయా!"

వెనగ్గా వచ్చి మోకాళ్ళమీద వంగి తన భుజంమీద తల ఆన్చి ప్రేమగా, తమకంగా పిలుస్తున్న భర్తను కాస్త తలవెనక్కు తిప్పి చూసి చిరునవ్వు నవ్వి మరలా అరటికాయ తరగడంలో మునిగిపోయింది ఛాయ.

"అంతేనా ? చిరునవ్వేనా ? ఇంకేమీ ఇచ్చేదిలేదా ?"

ఇచ్చేది లేదన్నట్టు వచ్చే నవ్వును పెదాలమధ్య బిగబట్టి తల అడ్డంగా తిప్పింది ఛాయ.

"ఓకే. పోనీ టిఫిన్ పెడ్తారా ?"

"సవినయంగా"

అతను కదల్లేదు. ఆమె బుగ్గకు తన బుగ్గానించి స్పర్శానందాన్ని అనుభవిస్తున్నాడు.

తన చెంపతో అతని చెంపమీద సన్నగా కొట్టినట్టుగా అంది. "లేవాలి మరి". ఆమె పెదాలమీద పారాడే హాసరేఖ అతనికి కన్పిస్తూనే వుంది ఒకప్రక్కగా..

"ఉహుఁ"

"మరి టిఫిన్ ఎలా పెట్టను ?"

"ఇలానే ...."

"ఇలానేనా ? ఓకే. కానీ నాకందుబాటులో వుందేది ఈ అరటికాయ మాత్రమే. అది పెట్టనా ?"

"ఏదైతేనేం, నీ చేతిగుండా వచ్చాక అది అమృతమే కదా !"

"శ్రీవారికి కవిత్వం వస్తోంది"

"అవును. ఇలాగే కదలకుండా కూర్చో ఓ గంట చాలు. నీ గుండెల మీద ఓ కథ వ్రాసేస్తాను."

"చాలు చాలు. ఇప్పటికే రచయితలు జాస్తయిపోయారు. లేవండి నాకు బోలెడు పనుంది."

"బోలెడు పనా ? యల్.ఐ.సి. ఉద్యోగస్థుడి భార్యకు బోలెడు పనా ? వాట్ పిటీ. శ్రీమతి ! వంటమనిషిని పెట్టుకోవోయ్."

అతను లేచి బుద్ధిగా ఆమె ఎదురుగా పీటమీద కూర్చున్నాడు పద్మాసనం వేసుకుని.

"ఎందుకూ ? ఈ ప్రభాత శృంగారాలన్నీ ఆమెకు పంచనా ?"

"నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావు శ్రీమతీ. నీ కష్టం చూడలేకా ...." టిఫిన్ తినడం ప్రారంభించాడు రాజారావు.

"నా కష్టం చూడలేకా ? నీ కష్టం చూచుకోలేకా ?"

"నాకా ? కష్టమా ? కష్టాలు మనదగ్గరకు రావు. జీవితాన్ని అనుభవించడమే మనధ్యేయం. దాన్ని కష్టాలమయం చేసుకోవడం మనమతం కాదు."

"జీవితాన్ని అనుభవిస్తారా ? ఎలాగ ?"

"ఇలాగ"అంటూ ఆమెకు వారించే అవకాశం ఇవ్వకుండానే టిఫిన్ తినడం పూర్తిచేసి ఆమె బుగ్గమీద చటుక్కున ముద్దుపెట్టుకున్నాడు రాజారావు.

"ఏవిటిది ?"

"ఏమీలేదోయ్. నీ బుగ్గల్లో ఒకటి దాచి వెళుతున్నాను ఆఫీస్‌నుండి వచ్చి తీసుకుంటాలే."

ఆమె గుండెల్లోనుండి శరీరంలోకి తీగలా పాకిన అనుభూతి.

ఇది ఈరోజు జరిగిన సంఘటన కాదు. తన గుండెల్లో, సదా గుసగుసలాడే ఇలాటి సంఘటనలు మా ఆరేళ్ళ సంసార జీవితంలో వేలకువేలు. కానీ ఈరోజు ఏం జరిగింది? తన భర్త, తన రాజా తనని ఏమి కోరాడు ? ఇది నిజమా ? అసలు ఇది సంభవమా ?

"ఛాయా ? నిన్నో కోరిక కోరుతాను, నన్ను అర్థం చేసుకుంటావా ? " చాలా సేపు తటపటాయించి అడిగాడు రాజారావు రాత్రి.

"చెప్పండి" తన భర్త ఏది అడిగినా తీర్చాలన్నంత ఆరాధన వుంది ఆమె గుండెల్లో అతనిపట్ల.

"చూడూ ! అసలు మనిషిమీద మనిషికి ప్రేమెందుకొస్తుం దంటావ్"

భర్తవైపు చిత్రంగా చూసింది ఛాయ.

"చెప్పు ఛాయా ! ఎందుకొస్తుంది ?"

అతని గుండెలమీద మెత్తగా ప్రేమగా రాస్తూ అంది ఛాయ.

"ఎందుకొస్తుందో వస్తుంది. దానికి కారణం అంటూ ఏముంటుంది ?"

"ఒకరిమీద వున్నంత ప్రేమే మరోవ్యక్తిమీద కూడా కలగడానికి అవకాశం వుంటుందా ?" అతను ఒకచెయ్యి ఛాయ చుట్టూవేసి సీలింగ్ ఫ్యాన్‌వైపు చూస్తూ కించిత్ ఆవేదన నిండిన కంఠంతో అడుగుతున్నాడు. భర్త ఈ రకం ప్రవర్తన ఛాయకు క్రొత్త. ఎప్పుడూ దేనినీ అతను అంత లోతుగా తీసుకోడు.

"ఎందుకలా వున్నారు ?" తలెత్తి భర్త కళ్ళల్లోకి చూడడానికి ప్రయత్నిస్తూ అంది ఛాయ.

"చెప్పు ఛాయా ! జవాబు చెప్పు"

ఆమె మరలా తన తలను అతని భుజంమీదకి వాల్చుకుంటూ అంది.

"సమంగా ప్రేమించడం .... ఏమో. చెప్పలేం, కొంత తేడా వుండచ్చు."

అతను మాట్లాడలేదు. మాట్లాడడానికి శక్తిని కూడబెట్టుకుంటు న్నట్టున్నాడు.

"బిడ్డల విషయంలో బహుశ అది సాధ్యమేనేమో !" సాలోచనగా అంది ఛాయ.

అతని ముఖం కాస్త కాంతివంతమయింది.

ఈసారి అతను తటపటాయించకుండా అన్నాడు.

"ఛాయా ! నీతో చెప్పుకుంటున్నాను. మా ఆఫీస్‌లో ఓ అమ్మాయుంది. ఆ అమ్మాయంటే నాకు చాలా ఇష్టం ఛాయా !"

తృళ్ళిపడింది ఛాయ. 'ఏమంటున్నాడు తన భర్త ? ఆ అమ్మాయంటే తన కిష్టమని తన భార్యతోనే చెప్పుకుంటున్నాడా ?' తనలో సహజంగా రేగిన అసూయను బలవంతాన ప్రక్కకునెట్టి నిగ్రహాన్ని కొనితెచ్చుకుంటూ అడిగింది ఛాయ.

"ఎలాంటి ఇష్టం ?"

అతను ఈమారు కొంత తటపటాయించాడు.

"నీకు అబద్ధం చెప్పాలనిలేదు ఛాయా. నీ మీదున్న ఇష్టంలాంటిదే" అలా చెప్పడానికి అతను ఈ బలాన్ని ఎలా కూడదీసుకున్నాడో కానీ, ఆ జవాబు ఆమె పెంచుకున్న నమ్మకంమీద, సున్నితమైన ఆమె గుండెల్లోని భావాలమీద పెద్దదెబ్బే తీసింది.

"నామీదున్న ఇష్టంలాంటిదా ?"ఆమె గుండెలు మండిపోతున్నాయి. అలా అతనన్నమాట అబద్ధమయితే బాగుండునని ఆ మంటల మధ్యగా ఆమె కోరుకుంటోంది.

"మాట్లాడవేం ఛాయా !" అరచేతితో ఆమె తలమీద మృదువుగా రాస్తూ అన్నాడు. అలాంటి స్పర్శ ఛాయకు ఎంతో ఇష్టమైంది. అతను తన తలమీద చెయ్యివేస్తే - మృత్యువుకూడా తననేమీ చేయలేదన్నంత ధీమాగా వుంటుందామెకు. కానీ ఈ క్షణంలో తను క్షణక్షణం కోరుకునే ఆ స్పర్శ భరించరానిదిగా వుంది. మరో అరక్షణానికి ఆ స్పర్శను భరించలేనిదానిలా అతని చెయ్యి తొలిగించి లేచి కూర్చుందామె.

అతను ఆమె కళ్ళల్లోకి చూసి దోషిలా తలవంచుకున్నాడు.

"ఆమె పేరేమిటి ?" తను చదువుకున్న చదువు, పెరిగిన వాతావర

ణము తనకు నేర్పిన సంస్కారంద్వారా వచ్చిన నిగ్రహంతో అడిగింది ఛాయ.

"జ్యోతి". అతను ఆమె పేరుచెప్పి ఊరుకోలేదు. ఛాయ అడక్కుండానే ఆమె వివరాలన్నీ చెప్పాడు.

"పాపం ఛాయా ! జ్యోతికి చిన్నప్పుడే పెళ్ళి చేశారట. కాపురానికి రాకముందే అతను పోయాడు. ఓ బిడ్డయినాలేదు ఆమెకు తోడు. చాలా మంచి అమ్మాయి."

ఎంత నిబ్బరంగా వుండాలని ప్రయత్నించినా ఆమె కనుబొమలు అసహనంగా ముడిపడనే పడ్డాయి.

"ఇదంతా నాకు చెప్పినందువల్ల ప్రయోజనం ఏమిటి ?" చిన్నగా నిదానంగా అడిగినా, ఆ ప్రశ్నలోని తీక్షణత రాజారావును తాకనే తాకింది. కానీ ఆ నాలుగుపదాల వాక్యంలో ఆమె గుండె పగిలి మాటలరూపంలో వచ్చిన నిరాశను, ఓటమిని అతను గమనించలేదు.

"నువ్వు ఒప్పుకుంటే, అంగీకరిస్తే ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను ఛాయా !"

ఛాయకు సర్వం అర్థమైపోయింది. రాజా పూర్తిగా నిర్ణయించుకునే, గట్టి కోరికతోనే తనని అడుగుతున్నాడు. ఆమెమీద ఎంతో కోరికలేందే తనని ఇలా ధైర్యంగా హింసించే సాహసం అతనికుండేదికాదు.

ఓటమితో, లజ్జతో ఆమె గుండెలు కాలిపోతున్నాయి. అక్కడినుండి లేచి పారిపోవాలనుంది ఆమెకు.

"నేను జ్యోతిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అని అంటున్న భర్త నీడకూడా తనమీద పడనంత దూరం పారిపోవాలనుంది ఆమెకు.

రాజారావు ఆమెకు కాస్త దగ్గరగా జరిగి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"చూడు ఛాయా ! నీకు బాధగా వుందా ? జ్యోతిని ఇష్టపడుతున్నానని. నువ్వంటే నాకు ప్రేమలేదనుకుంటున్నావా ? నువ్వంటే నాకు చాలా ఇష్టం ఛాయా ! అయినా జ్యోతి అంటే ఎందుకు ఇష్టం కలుగుతోందో తల బద్దలు కొట్టుకున్నా నాకర్థం కావడంలేదు. ఆమెలేందే బ్రతకలేననిపిస్తోంది."

ఆఖరిమాటకు తన చెయ్యిని ఓ కొలిమిలో పెట్టినట్టుగా అనిపించి చటుక్కున లాగేసుకుంది ఛాయ.

ఏమంటున్నాడు తన భర్త ? జ్యోతి లేందే బ్రతకలేనంటున్నాడు. అలాంటిమాటలు వింటూ తను ఇంకా అతని ఎదురుగా కూర్చోనుంది. ఏమిటి ఈ బలహీనత ! ఆమెకు తనమీద తనకే జాలిగావుంది. తన పరిస్థితులకు తనకుతానే సానుభూతి చూపించుకోవాల్సిన అధమస్థితిలో వుంది.

"ఛాయా ! నన్నర్థం చేసుకో. పోనీ నన్ను క్షమించి ఇందుకు ఒప్పుకో ఛాయా ! ఆ తర్వాత నీమీద నా ప్రేమ వీసమెత్తు సన్నగిల్లినా నువ్వు అప్పుడు నన్ను క్షమించవద్దు. నువ్వు ఏమి చేయమంటే అది చేస్తాను."

వెర్రిగా చూస్తోంది ఛాయ.

జీవితం ఖర్చయిపోయాక అతన్ని క్షమిస్తే ఏం ? క్షమించలేకపోతేనేం ?

"ఛాయా ! ప్లీజ్"

ఆమె మాట్లాడ్డంలేదు. వెర్రిగా, క్రొత్తగా అతన్ని చూస్తోంది. ఇలా భార్యను అడగగల భర్తలు కూడా వుంటారా ?

"నామీద నమ్మకంలేదా ఛాయా నీకు. నీకు అన్యాయం జరగనిస్తానా ఛాయా !"

అతనేం మాట్లాడుతున్నాడో ఆమెకు అర్థం కావడంలేదు 'అసలతని మాటలకు అర్థం అతనికైనా తెలుసా?' అని విభ్రాంతిలో మునిగిపోతోందామె.

'అన్యాయం చేయకపోవడమంటే ఏమిటి? ఇప్పుడు పెట్టినట్టే తిండి పెట్టడమా ? ఇప్పుడు తీర్చినట్టే కోరికలు తీర్చడమా ?' ఆమెకంతా అయోమయంగా వుంది – స్పృహ తప్పిపోతున్నట్టుగా వుంది.

తన నమ్మకంమీద ఎంత బలమైన దెబ్బ ! తన జీవితంలో ఎంత పెద్ద లోటు ! ఎంత ఎదురుచూడని అవమానం ! !

ఆమె ఆలోచనలమీద ఏదో చీకటి తెర.

"ఛాయా ! మాట్లాడు ఛాయా !"

"నాకు బాగోలేదు. నన్ను పడుకోనివ్వండి. రేపు మాట్లాడుకుందాం"

ఆమెకు తలంతా దిమ్మెక్కిపోతోంది.

ఆమె నీరసపు జవాబు రాజారావుకి కొంతవరకు తృప్తినిచ్చింది.

అతను దిండు సరిచేసాడు. ఆమె భుజం పట్టుకుని పడుకోబెట్టాడు. అతని చేతిని విదిలించను కూడా ఆమెకు శక్తిలేదు. నీరసంగా, సొలిపోయినట్టుగా ఆ దిండుమీద వాలిపోయి కళ్ళు మూసుకుంది ఛాయ.

## 2

ఆమె జీవితంలో నిద్రపట్టని మొదటి అనుభవం ఇది ఆమెకు. అరగంట తర్వాత కాస్త నిస్త్రాణతగ్గి ప్రక్కకు తిరిగి చూసింది ఛాయ. రాజారావు గాఢనిద్రలో వున్నాడు.

'ఎంత గుండెల్లేవు ఈ మగాళ్ళకి !'

'తనని అగాధంలో ముంచే నిజంచెప్పి ఎంత నిశ్చింతగా నిద్ర పోతున్నాడు !'

'ప్రేమ ఇంత చంచలమైందా ? తన గర్వం ఎంత చప్పగా అణచ బడింది !'

అలా తిరుగుతున్న ఫ్యాన్ వైపు చూస్తూ ఆలోచిస్తున్న ఛాయ కను కొలకుల్లోనుండి కన్నీరు జారి దిండులో ఇంకిపోతుంది.

ఇంతసేపటికి ఛాయలో ఆశ్చర్యం, విభ్రాంతి, అయోమయం తగ్గి, తనేం జవాబివ్వాలి? అనే ప్రశ్న పుట్టుకొచ్చింది. జవాబుని రేపటికి వాయిదా వేసినా పరిష్కారానికి మార్గాలు వెదకసాగింది ఆమె మేధస్సు.

'జ్యోతంటే నా కిష్టమ'న్న భర్తను భరించడం చాలా కష్టమనిపిం చింది కాసేపు ఛాయకు.

'నీకు అన్యాయం చేయను' అన్న భర్తమీద జుగుప్స కలిగింది.

అన్యాయం చేయడం కాదూ ఇది ? నేను, నా భర్త, నా సంసారం అనుకున్న తన జీవితంలోకి మరో వ్యక్తిని ఆహ్వానించడం తనకు అన్యాయం చేయడంకాదా? నావాడు అనుకున్నవ్యక్తి మరో ఆడదానికికూడా స్వంతం కావడం తనకు అన్యాయం చేయడంకాదూ ?' అలాంటి వ్యక్తితో తను క్షమించి ఇక కాపురం చేయగలదా ? ఎంత అసహ్యంగా వుంటుంది ఆ జీవితం !

'ఊహుఁ. తను ప్రేమించలేదు. అంత ఔదార్యం తనలో లేదు. తన జీవితభాగస్వామి మరో భాగస్వామిని ఇంటికి తెచ్చుకొని కాపురం చేసే

సుందరదృశ్యాన్ని చూసేశక్తి తనకులేదు. అతని నోటివెంట మరొక్కసారి ఆ ప్రపోజల్ వినకముందే, తనుపుట్టి పెరిగిన ఊరికి తనను గుండెల్లో దాచుకునే అమ్మ ఒడిలోకి పారిపోవాలి."

అలా నిర్ణయించుకుని, తన భర్తకి చాలాదూరంగా జరిగి పడుకుని కళ్ళు మూసుకున్న ఛాయకు నిద్ర రాలేదు. నిముషాలు గడిచేకొలదీ ఆమెలో నిర్ణయం సడలిపోసాగింది.

'ఎంతకాలమని తను అమ్మదగ్గరుంటుంది? అమ్మ పోయాక తనకు తోడెవరు? తన అన్న ఈయన తనను ప్రేమించినంతగా ప్రేమించగలడా? పైగా భర్తనొదిలేసిన ఆడదానిగా ఈ సమాజంలో తన స్థానమేమిటి?'

అలా ఆలోచించిన ఛాయ శరీరమంతా నీరసం ఆవహించింది. తననింత నరకయాతనకు గురిచేస్తున్న భర్తవైపు కళ్ళు తిప్పిచూసింది. అతను నిశ్చలంగా నిద్రపోతున్నాడు.

'ఛాయా! నువ్వు క్షణం కనపడకపోయినా నేను బ్రతకలేను ఛాయా!' అని కొన్నివేలమార్లు అన్న అతని ఎర్రటి పెదాలవంక చూసింది ఛాయ.

'నిన్నిలా చూస్తూ ఎన్ని యుగాలైనా బ్రతికేయగలను' అన్నట్లున్న అతని అరమోడ్పు కనులవంక చూసింది.

'ఆ పెదాలు ఇక తన స్వంతంకాదు. ఆ కళ్ళల్లో భావం ఇక తన స్వంతంకాదు.' అలా అనుకోవడం ఛాయకు భరించలేనట్టుగా వుంది.

రాజా తనకు అన్నం పెడతాడు, తన కోరికలు తీరుస్తాడు. అంతవరకు ఇంకా తనకు నమ్మకముంది. కానీ తనకు కావాల్సింది అంతేనా? కాదు... కాదు.

తనకు అతని ప్రేమ కావాలి, ఆదరణ కావాలి, అతని ఆప్యాయత

కావాలి. సంపూర్ణంగా కావాలి. ఉహుఁ తను అతన్ని పంచుకోలేదు. అసలు అతన్ని వదిలి తను బ్రతగ్గలదా ! ఉహు బ్రతకలేదు. మరెలా ?

ఆమె గుండెల్లో అతను రేపిన జ్వాలవల్ల నలిగిన ప్రేమ కాస్త ఊపిరి పీల్చుకుంది. మరలా ఆమె గుండెల్లో అతనిమీద అప్యాయత, ప్రేమ.

'ఉహుఁ నేను బ్రతకలేను. ఇతనులేందే నేను బ్రతకలేను. జ్యోతిని అతను పెళ్ళి చేసుకోవడం తనకిష్టం లేదని చెప్పేస్తాను'

అలా నిర్ణయించుకున్న ఆమెకు చాలా రిలీఫ్‌గా అనిపించింది. తన జీవితాన్ని తాను భద్రం చేసుకున్న తృప్తి కలిగింది. ఆ తృప్తితో ఎప్పుడో చల్లగా నిద్రలోకి జారుకుంది.

కొన్ని నిమిషాలే నిద్రపోయిందో, కొన్ని గంటల తర్వాతే మెలుకు వొచ్చిందో - ఆమె మేలుకునేసరికి ఆమెగుండె దడదడ కొట్టుకుంటోంది ఒళ్ళంతా చమట. ఏదో కల, ఆ కల గుర్తులేదు. కానీ ఆ కల అందించిన భ్రాంతి ఆమెనింకా వదలడంలేదు.

తను అలాంటి జవాబు చెప్పాక వాళ్ళ పెళ్ళికి తను నిరాకరించాక, తన సంసార జీవితాన్ని అన్ని కోణాల్లో ఆలోచించినట్టుంది ఛాయ.

తను నిరాకరించిన అసంతృప్తితో, ఆమెను పోగొట్టుకున్న నిరాశతో తనకు నిజమైన ఆనందాన్నివ్వగలడా రాజా ? అలా ఆలోచించిన ఆమెను మరలా నిస్త్రాణ చుట్టేసింది. అతని సంపూర్ణమైన మమకారాన్ని పొందకుండా కేవలం భర్తగా అతనిని బంధించడం తనకిష్టంలేదు.

కోపతాపాల నిష్ఠూరాలమధ్య, సూటిపోటీమాటల మధ్య బ్రతకడం తనకసహ్యం. అంతకంటే పుట్టింట్లో శూన్యజీవితం మేలు.

---

అయితే తనేం చేయాలి ? అతన్ని వదులుకోవాలా ? అతనితో రాజీ పడాలా ?

ఆమెస ఆలోచనలు తట్టడంలేదు. నిముషానికో నిర్ణయం.

# 3

కళ్ళు తెరిచిన రాజారావు ప్రక్కకుతిరిగి చూసాడు. తన భార్య నిద్రపోవడంలేదు మంకెన పువ్వులాంటి కళ్ళతో శూన్యంలోకి చూస్తోంది.

"ఛాయా !" పిలిచాడు రాజారావు.

"నిద్రపోలేదా ?" ఆమెవైపు తిరిగి చెయ్యి ఆమె గుండెలమీద వేస్తూ ప్రేమగా అడిగాడు.

కళ్ళు త్రిప్పి భర్తవైపు చూసి మౌనంగా ఊరుకుంది ఛాయ.

'ఇలాంటి ప్రేమకు తను తొందరలో కరువు కాబోతోందా ?' ఆమె ఏడవడం లేదు. కానీ ఆమె గుండెలు ఏడుస్తున్నాయి.

"ఏమి నిర్ణయించుకున్నావు ఛాయా !" అతను దీనంగా అడుగుతున్నాడు.

ఆమె నిర్ణయాలు మరలా మారిపోతున్నాయి.

"ఛాయా ! నువ్వు దీనిగురించి చాలా సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నావుగానీ, పూర్వకాలంలో అయితేనా ఈ పెళ్ళిళ్ళకు అంత ప్రాముఖ్యత లేదు. నీకు మన హిస్టరీ గురించి చెప్పనా వింటావా ?"

ఛాయ మాట్లాడలేదు. అలాగే వెల్లకిలా మౌనంగా పడుకొనుంది. ఆమె కళ్ళు అలానే ఎర్రగా వున్నాయి. అతని చెయ్యి ఆమె గుండెలమీద ఇరువురికీ ఎలాంటి స్పందననూ ఇవ్వకుండా అలాగే పడివుంది.

మనిషి సంఘజీవి కాకముందు, ఎవరిని ఇష్టపడితే వాళ్ళను అనుభవించేవాడు. వాళ్ళకిదసలు పట్టించుకునే విషయంగా అన్పించేదికాదు. కొంత నాగరికత తెలిసాక రెండు తెగలుగా విడిపోయారు. ఏక తెగలో వాళ్ళను అనుభవించకూడదని నియమం పెట్టుకున్నారు. ఎదురు తెగలో వాళ్ళని ఇష్టమొచ్చిన రోజు ఇష్టమొచ్చిన వాళ్ళని అనుభవించవచ్చు. అందులో సెంటిమెంట్స్ లేవు. నాది అనే భావంలేదు. అందుకే వాళ్ళు సుఖపడ్డారు.

ఛాయ వెర్రిగా చూసింది. 'వాళ్ళు సుఖపడ్డారా ? అప్పుడు మనిషికి మృగానికి తేడా ఏమిటి ?'

"రానురాను నాదీ అనే స్వార్థం పెరిగి మనుషుల్నికూడా స్వంతం చేసుకోవడం, బాంధవ్యాల పేరిట మనసుల్ని కట్టేయడం ప్రారంభించారు. దాంతో ద్వేషాలు, కక్షలు, అశాంతి ...." అతను చెప్పుకుపోతున్నాడు. ఛాయకు చాలా ఆశ్చర్యంగా వుంది.

ఇతను నావాడు, ఈమె నాది అని అనుబంధాలు పెంచుకోవడం - ఎంత తీయటి అనుభూతి ఇది .... అలా ఒకరికొకరు నీకు నేనున్నానని భరోసా ఇచ్చుకోవడం అశాంతిగా వుందా వీళ్ళకి? ఇన్నాళ్ళ తామిద్దరిమధ్య బాండేజస్ ఇతనికి అశాంతిగా అన్పించాయా ?

ఛాయకు చాలా దిగులుగా వుంది. చాలా అశాంతిగా వుంది.

"ఇలాంటి వాతావరణంలో పెరిగిన నువ్వు అలాంటి సెంటిమెంట్స్‌ను జీర్ణించుకుని బాధపడుతున్నావుగానీ నిజానికి నలుగురం కలిసి స్నేహంగా వుండడంలో ఎంత ఆనందముంటుంది ?"

అంటే .... అంటే .... నలుగురం అంటే తనూ రాజా, జ్యోతి, జ్యోతికి పుట్టే పిల్లలు, తనకు పుడితే తన పిల్లలు - వీళ్ళా? ఆనందంగానా?

ఇతనికి మతిపోలేదు కదా !' అని అనుకున్న ఛాయకు అతని మాటలు వింటుంటే నిజంగా ఆమెకే మతిపోతోంది.

'ప్రేమ అంటే ఇదా ? ఈ రోజు ఛాయ, రేపు జ్యోతి, ఎల్లుండి మరో మాలిని. ఇంత చంచలమైందా ప్రేమ. ఒక వ్యక్తిమీద ఇష్టం ఏర్పడ గానే పెళ్ళి చేసుకోవడమేనా ? ఇంత బలహీనమైందా వివాహ వ్యవస్థ !'

"ఛాయా ! నువ్వు ఆ పురాతన ఆలోచనల్లో వుండబట్టి నీకు బాధగా వుందిగానీ, కాస్త విశాలంగా ఆలోచిస్తే నీకూ చాలా ఆనందంగానే వుంటుంది."

అతను ఇలా మాట్లాడుతుంటే ఛాయ జుగుప్సగాచూసి లేచి కూర్చుంది.

"ఆ అమ్మాయికి ఈ విషయం తెలుసా ? అదే.... మీరు ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్టు...." ఎంత నిగ్రహించుకున్నా ఆమె కంఠంలో కాఠిన్యం చోటు చేసుకుంది.

"తెలుసు."

"ఏమంది ?" అదిరే గుండెలతో అడిగింది ఛాయ.

"నువ్వు అంగీకరిస్తే తన కిష్టమేనంది."

ఛాయ తాలూకు ఆఖరి ఆశకూడా ఆరిపోయింది.

"నేను అంగీకరిస్తే ఒప్పుకుంటానందా ?"

రాజారావు మాట్లాడలేదు.

"ఆ అమ్మాయే నయం" విచారంగా అంది ఛాయ.

"అదేమిటి అలా అంటున్నావు. నేను మాత్రం నువ్వు ఒప్పు కుంటేనేకదా చేసుకుంటానంది, తేడా ఏముంది ?"

కన్నార్పకుండా అతనివంక చూసింది ఛాయ. ఆమెకు క్షణక్షణం అతను క్రొత్తగా ధ్వనిస్తున్నాడు.

"ఆ అమ్మాయికి నేనేమీ కాను, మీకు నేనే అన్నీ. అంతే తేడా మీ యిద్దరిమధ్య" నీరసంగా లేచి నిల్చుంది ఛాయ. ఆమెకు తన స్థితి తనకే దుర్భరంగా వుంది.

"అంటే" కళ్ళెత్తి చూసాడు రాజారావు.

"ఈ జన్మకు మీకు ఆ.తేడా అర్థం కాదులెండి" అనేసి లోపలికి పోబోయిన భార్య చెయ్యి పట్టుకుని ఆపాడు రాజారావు.

"ఛాయా ! ప్లీజ్ నీ నిర్ణయం చెప్పేసి పో ! లేకపోతే ఈ టెన్షన్‌ని నేను భరించలేను."

కన్నెత్తి కన్నార్పకుండా క్షణం చూసింది ఛాయ.

ఎంత నిర్దయుడు. తను ఈ రాత్రంతా అనుభవించిన టెన్షన్‌గురించి ఆలోచించకుండా అతని టెన్షన్‌నుండి బయటపడేయమని తననే కోరుతు న్నాడు !

"అలాగే మీ ఇష్టం" విరక్తిగా అనేసి వెళ్ళబోయి ఆగింది.

"కానీ పెళ్ళి చేసుకోవడానికి ఆర్నెల్లు ఆగండి."

ఛాయలో కొనఆశ ఈ ఆర్నెల్లల్లో అతను మారతాడేమోనని.

"ఆర్నెల్లా ?"

"ఏం, ఆర్నెల్లుకూడా ఆగలేరా ?"

"ఒప్పుకున్నావు కదా ! ఆర్నెల్లెందుకని...." నసిగాడు రాజారావు.

నవ్వింది ఛాయ. ఆ నవ్వునిండా విషాదం.

"నేను ఒప్పుకున్నందుకు మీకు సంతోషంలేదు. ఆర్నెల్లు ఆగమన్నం దుకు విచారంగా వుంది కదూ !"

ఛాయ నిలువెల్లా విరక్తి.

మాట్లాడలేదు రాజారావు.

"నేను ఒప్పుకున్నానుకదా ! ఆర్నెల్లు ఆగలేరా ?"

"అలాగే" అయిష్టంగా అని లేచాడు రాజారావు.

నిట్టూర్చింది ఛాయ.

## 4

"ఛాయా ! ఇల్లు మరీ ఇరుగ్గా వుందికదూ !"

"ఇరుగ్గా వుందా ? ఈ రోజు కొత్తగా ?" కాఫీకప్పు పెదాలదగ్గర పెట్టుకోబోతూ ఆగి అంది ఛాయ.

"ఇప్పుడు ఫర్వాలేదు సరిపోతుందనుకో. జ్యోతి వచ్చాక చాలదు. రెండు బెడ్ రూమ్స్ వుండే ఇల్లు తీసుకోవాలి."

అతను హుషారుగా చెపుతున్నాడు. ఛాయకు కాఫీ రుచించడం మానేసింది.

* * *

"ఛాయా ! షాపింగ్ కెళ్దాం వస్తావా ?"

"ఎందుకు ?"

"చీరలేమయినా కొనుక్కుందువు. చాలా రోజులయింది కదూ షాపింగ్ కెళ్ళి."

"పదండి" ఛాయకూడా అందిన జీవితంతో రాజీపడడానికి ప్రయత్నిస్తోంది. ఉన్నంతలో సుఖాన్ని వెతుక్కోకపోతే బ్రతకలేమని ఆమెకు తెలుసు. కన్నీళ్ళు, సానుభూతి అంటే అందరి ఆడవాళ్ళలాగ ఛాయకు మమకార్లం లేదు.

రెండు చీరలు సెలెక్ట్ చేసుకుంది ఛాయ. మరో చీర చూస్తున్న భర్తను వారించింది.

"ఇక చాలు రండి ఇప్పటికే చాలా అయింది."

"నీకు కాదు, ఇది జ్యోతికి బాగుంటుందని చూస్తున్నాను."

కొద్దిగా అఫెండ్ అయిన ఛాయ సర్దుకుంది. పోనీలే ఆమె అతనికి కాబోయే భార్యకదా !

"జ్యోతి నలుపా, తెలుపా ?"

"నీకంటే కొద్ది తెలుపు డార్క్ కలర్ చీరలంటే ఇష్టం."

ఎంత వద్దనుకున్నా మనసు గాయపరుస్తూనే వుంది.

"ఛాయా! నీకు బెంగాల్ కాటన్స్ ఆర్గండీస్ బాగుంటాయి. సిల్క్ వద్దు" అని తనకు ఎప్పుడూ సెలెక్ట్ చేసిపెట్టే తనభర్త జ్యోతికి డార్క్ కలర్ చీరలు బాగుంటాయి అంటున్నాడు. అలా వినడం తనకేమంత ఇష్టమయిన సంగతికాదు. కనీసం తనదగ్గర ఆమె విషయాలు ఎత్తకుండా వుంటే ఎంత బాగుంటుంది !

* * *

"ఛాయా !" ఆనందంగా పిలుస్తూ లోపలికొచ్చాడు రాజారావు.

అతని ఆనందాన్ని ఆమె పంచుకోలేకపోతోంది. ఆమె గుండెల్లో ముల్లు కలుక్కుమని ఇంకా గుచ్చుకుంటూనే వుంది అప్పుడప్పుడు.

"రేపు మనింటికి జ్యోతి వస్తుంది ఛాయా"

"ఆవిడవస్తే అంత ఆనందం దేనికి ?"

"అదేం అదే వద్దన్నాను. ఎంత అసూయో చూడు నీలో !"

ఒళ్ళు మండిపోయింది ఛాయకు. 'అసూయా ? నా పరిస్థితుల్లో నువ్వుంటే .... అప్పుడు .... అప్పుడు తెలుస్తుంది ? అసూయ ఎందుకొస్తుందో' మనసులో మాట పైకి అనలేదు.

"అసూయకాదు, ఎప్పటికీ మనింటికొచ్చే పిల్లేకదా దానికింత హంగామా ఎందుకంటున్నాను" ఛాయ ఈ మధ్య నటించడం నేర్చుకుంటోంది.

"ఓకే, చూడు రేపేమయినా స్పెషల్ చేయవా ?"

భర్తవైపు చురుగ్గా చూసి లోపలికెళ్ళబోయింది ఛాయ.

"ఛాయా ! ఇలారా - లోకంలో ఎంతమంది ఇద్దరు భార్యలు ఒక ఇంట స్నేహంగా లేరూ? చెప్పు. నువ్విలా ఫీల్ అవకు ఛాయా."

ఇంకా చురుగ్గా చూసిందామె.

"మొదటిభార్య ఇష్టపడి చేసుండచ్చు. అందులో తప్పేమీలేదు ఆమెకు బాధలేదుకనక ...."

"ఇప్పుడుమాత్రం నువ్వు ఒప్పుకోకపోతే నేను చేసుకుంటానా ?"

"ఒప్పుకోవడం, ఒప్పించడం రెండూ ఒకటికాదు" అని ఇక ఆగకుండా విసురుగా వెళ్ళిపోయింది ఛాయ.

ఛాయ వెనకనే వెళ్ళాడు రాజా.

* * *

"ఛాయా ! ఈ మధ్యన ముఖాన మొటిమలు వస్తున్నాయి. జ్యోతి క్లియరాసిల్ రాసుకుంటుందట. చాలా నున్నగా నుంటుంది జ్యోతి ముఖం. నీకూ ఒక ట్యూబ్ కొని తెస్తానుండు" పడకలో అసహనంగా కదిలింది ఛాయ.

ఛాయకూడా అందంగా వుండాలనే అతని భావం వెనుక జ్యోతి ప్రసక్తి ఆమెకు ముల్లులా గుచ్చుకుంది.

ఛాయ అతని అరచేతిలోవున్న తన ముఖాన్ని ప్రక్కకు తీసుకోవాలని ప్రయత్నించి ఓడిపోయింది.

ఆమె ముఖంతో తన ముఖం ఆనిస్తూ, "నువ్వు వినలేదు కదూ ! జ్యోతి గొంతు చాలా మృదువుగా వుంటుంది" అన్నాడు పరవశంగా.

తన భార్యదగ్గర జ్యోతిని పొగడకూడదనే ఇంగితాన్ని తినేసేంత మత్తు అతన్ని ఆవరించి వుంది. అతన్ని మెల్లిగా వదిలించుకుని పడుకుంది ఛాయ.

'ఎంత క్రూరులు ఈ మగాళ్ళు !'

"ఛాయా ! జ్యోతి ఏమందో తెలుసా ?" అతను ఛాయవైపు తిరిగి తన చెయ్యి ఆమెమీదుగా వేయబోతూ అన్నాడు.

ఛాయ ఆ చేతిని తొలగిస్తూ అటు తిరిగి పడుకుంది.

"ప్లీజ్ ! నాకు నిద్ర వస్తోంది పడుకోనివ్వండి."

రాజారావుకి అప్పటికి స్పృహ వచ్చింది. ఛాయకు నిద్ర అప్పుడే రాదని అతనికి తెలుసు.

కొద్దిసేపు అతనేం మాట్లాడలేదు. భార్య అలా ముభావంగా వుండడం అతనికి బాగోలేదు.

"ఛాయా ! అసూయపడుతున్నావా ?" అన్నాడు అతని గొంతు చాలా మృదువుగా వుంది.

ఛాయ ఇటు తిరగలేదు కాని నీరసంగా, ఆగి ఆగి అంది.

"ఒకవేళ నేను మరో మగాణ్ణి ఇష్టపడితే మీకు-కోపం రాదా ?"

ఒక్క నిమిషం తర్వాత జవాబు చెప్పాడు రాజారావు.

"ఉహూ రాకూడదు. ఒక ఆడదానికి, ఒక మగాడికి మధ్య ఆకర్షణ చాలా సహజమైంది ?"

ఈసారి విస్తుపోతూ ఇటు తిరిగింది ఛాయ. 'సహజమైందా ?'

"చెప్పాగా ఛాయా ! మనం జీర్ణించుకున్న సంస్కృతి అలాంటిది కాబట్టి ఒక మగాడికి ఒక ఆడదానికీమధ్య ఆకర్షణ సహజమైందని నేనంటే నువ్వు అంగీకరించడానికి ఇష్టపడడంలేదుగానీ బాగా ఆలోచించు. ఆ ఆకర్షణే లేకపోతే భార్యాభర్తలమధ్య ఇంత భ్రమలుండేవి కావు."

"భార్యాభర్తలమధ్య వుండేవి కేవలం భ్రమలా ?" ఇంకా విస్తుపోతూ చూసింది ఛాయ.

"కేవలం భ్రమలని నేనడంలేదు, ఇతర బాంధవ్యాలమధ్య లేని బాండేజస్ భార్యాభర్తలమధ్య ఉన్నాయీ అంటే దానికి కారణం ఇదని చెపుతున్నాను."

ఛాయ మాట్లాడలేదు. అతను చెప్పిన థియరీని అర్థం చేసుకోవడానికి ఛాయకు భయం వేస్తోంది.

"ఛాయా ? ఒకటడుగుతాను నిజం చేప్తావా ?" సన్నటి చిరునవ్వుతో చూస్తున్న రాజారావు.

అడగండన్నట్టు దిగులుగా చూసింది ఛాయ. 'ఇంకేమి క్రొత్త థియరీలు ప్రవేశపెడతాడో' అని ఆమెకు భయంగా వుంది. తామిద్దరూ ఇంతకాలం కలిసుండడానికి కారణం కేవలం ఆకర్షణే అన్నట్టు అతను మాట్లాడుతుంటే, ఆమెకు చెప్పలేనంత దిగులుగా వుంది.

"ఛాయా ! నిజం చెప్పాలి మరి. నేను నీకు భర్తననే విషయం

మర్చిపోయి చెప్పాలి ? నీకు మరో మగాణ్ణి చూసి ఎప్పుడూ ఆకర్షణ కలగలేదూ ? అతనితో కొన్ని క్షణాలు గడిపితే బాగుణ్ణనిపించలేదూ ?"

దిగులుగా చూసింది ఛాయ.

"ఉహుఁ నాకెప్పుడూ అలా ఎవరిగురించీ అనిపించలేదు."

"ఎప్పుడూ ! ? ...."

"ఉహుఁ ఒకవేళ పెళ్ళికాకముందు ఇలాంటివాడిని చేసుకుంటే బాగుణ్ణనిపించివుంటే అనిపించి వుండచ్చు. కానీ అతనితో కొన్ని క్షణాలు కాదుకదా అరక్షణంకూడా వుండాలనిపించలేదు."

'పూర్ గర్ల్' అని కొద్దిగా పెద్దగా నవ్వి 'పడుకో' అని ఆమెమీద చెయ్యివేసి సర్దుకుని పడుకున్నాడు రాజారావు.

ఆ రాత్రి మరలా నిద్రపట్టలేదు ఛాయకు.

## 5

మ్యూజికల్ బజర్ శబ్దానికి చేతిలో పని వదిలేసి ఇంచుమించు పరిగెట్టింది ఛాయ.

ఆమెకీమధ్య భర్త అంటే భ్రమ జాస్తిగా వుంది. అతను ఆమెకు దూరమయ్యేకొద్దీ ఆమె మరీ దగ్గరవుతోంది మానసికంగా అతనికి.

ఎంతో ఆతృతగా తలుపు తీసిన ఆమెకు కొండంత నైరాశ్యం ఎదురైంది. చిరునవ్వుతో నిల్చొనున్న భర్తవెనుక సంకోచంగా, బెరుగ్గా ఒదిగి నిల్చొనున్న ఓ అమ్మాయి.

ఛాయ గుండె లోతుల్లో అసూయ - ఆమెమీద శత్రుభావం.

"రండి." ముఖంమీద చిరునవ్వు పులుముకుని ఆహ్వానించింది ఛాయ.

"ఎవరో అర్థమయిపోయిందా ?" అతని ముఖంనిండా సంబరం గుండెల్లో తొణికే ఆనందానికి అది ప్రతిబింబం.

ఆ గుండెలమీద తలాన్చి ఈ గుండెలు నావి, ఇతను నావాడు అని కొన్నివేలసార్లు అనుకున్న ఛాయ గుండెలీనాడు అవమానంతో మండి పోతున్నాయి.

రాజారావు రెండడుగులు వేసాడు. కానీ జ్యోతి కుంచించుకుపోయి నట్లక్కడే నిల్చుండిపోయింది. ఆ పిల్లకి ఈ సమావేశం చాల డెలికేట్‌గానే వుంది.

"రా జ్యోతీ !" వెనక్కు తిరిగి పిలుస్తున్నాడు రాజారావు.

ఆరేళ్ళ క్రితం "రా ఛాయా !" అని పిలిచినట్లనిపించింది ఛాయకు.

ఇంకొక్కక్షణం అక్కడ నిలబడితే తన సంస్కారపు పొరల్లో దాచుకున్న అసూయ ఎక్కడ బయటపడుతుందోనని త్వర త్వరగా వంటింట్లో దూరింది.

రాజారావుకు కూడా కాస్త గిల్టీగానే వుంది కానీ తను గిల్టీగా వున్నట్లు అటు ఛాయకు ఇటు జ్యోతికి తెలియకూడదని తను చాల ఫ్రీగా వున్నట్లు ఏవో అతికీ అతకని కబుర్లు చెప్తూ లోపలికి కేకేసాడు.

"ఛాయా ! 'టీ' పెట్టకు జ్యోతికలవాటు లేదు. అందరికీ కాఫీ తీసు కురా !"

స్టౌమీద నీళ్ళు కాగినట్లే ఛాయ మనసుకూడా సలసల కాగిపోతోంది.

ట్రేతో కాఫీ కప్పులతో హాలులోకి వచ్చిన ఛాయను ఒక్కమారుగా

మనస్సు కొంత కుదుటపడింది. కారణం తనూహించినట్లుగా వాళ్ళిద్దరూ అంత సన్నిహితంగా కబుర్లతో ఆనందించడంలేదు. జ్యోతి మౌనంగా తల క్రిందకు దించి కూర్చొనుంది. రాజారావు టీవిని ట్యూన్ చేస్తున్నాడు.

"మీరు వుండే ఇల్లు ఇక్కడికి దగ్గరేనా ?" ఛాయ మనస్సును కూడగట్టుకుని అడిగింది.

ఏదో ఒకటి మాట్లాడకపోతే ఆ వాతావరణం ఛాయకు ఊపిరాడనట్టుంది.

ఇద్దరూ ఆశ్చర్యంగా ఛాయవైపు చూసారు.

ఈ మాత్రం చిన్న ఆదరణను కూడా ఊహించలేదు జ్యోతి.

కళ్ళెత్తి "దగ్గరే" అంది వినీ వినిపించనట్టు.

"ఇక్కడ కూర్చుంటారా ? బెడ్‌రూమ్‌లోకెళ్దామా ?"

ఛాయవాళ్ళ ఇల్లు ఉన్నంతలో డీసెంట్‌గానే వుంటుంది. చిన్న బెడ్‌రూమ్, అటాచ్‌డ్ బాత్‌రూమ్ మరీ చిన్నదిగాని డ్రాయింగ్‌రూమ్, అన్ని వసతులున్న స్లాబ్స్ పోసిన వంటిల్లు, మొజాయిక్ ఫ్లోరింగ్.

"ఫరవాలేదు ఇక్కడ బాగానే వుంది" మరీ చిన్నగా అంది జ్యోతి.

ఇంకేం మాట్లాడాలో తోచలేదు ఛాయకు.

సోఫాలో ఒదిగికూర్చున్న జ్యోతిని చూస్తోంది ఛాయ. జ్యోతి బాగానే వుంది. కానీ తన అందాన్ని ఆరేళ్ళ మమకారాన్నీ కాలదన్నుకుని ఆహ్వానించే ఆకర్షణ ఆమెలో ఏముంది ?

"ఈ మధ్య ఏం సినిమాలు చూసారు. 'పెళ్ళిచేసుకుందాం !' బాగుంది కదూ ?"

బాగుందన్నట్టు తలూపింది జ్యోతి. అలా ఛాయ స్నేహంగా మాట్లాడుతుంటే జ్యోతికి చాలా గిల్టీగా వుంది.

"జ్యోతి పెద్దగా పిక్చర్స్ చూడదు. మా ఛాయకు సినిమాలంటే పిచ్చి" అన్నాడు రాజారావు ఇద్దరివంక మార్చిమార్చి చూస్తూ.

తన భర్త తాలూకు ప్రతి మాటా చాలా కృత్రిమంగా ధ్వనిస్తోంది ఛాయకు.

'అతనసలు మాట్లాడకుండా మౌనంగా వుంటే బావుణ్ణ'ని ఆమె మనసు కోరుకుంటోంది.

"మీ చీర బాగుంది ఎక్కడ కొన్నారు?" జ్యోతి ఇబ్బందిగా చూసింది.

"అది ...అది నేనీమధ్య మధుర వెళ్ళానుకదూ" అక్కడ కొన్నాను. నీకూ తెద్దామనుకున్నాను గానీ ... నీకు మధుర చీరలు ఇష్టంలేదనీ ..."

ఛాయ భర్త కళ్ళల్లోకి చురుగ్గా చూసి తల త్రిప్పుకుంది.

'సంజాయిషీలు చెప్పకండీ నాకసహ్యం' అన్నట్టున్నాయి ఆమె చూపులు.

"నిజమే నాకు మధుర చీరలు ఇష్టంలేదు, సేలం చీరలంటే ఇష్టం. ఈసారెప్పుడైనా సేలం వెళితే నాకు లెమన్ ఎల్లోలో ఒక చీర తెచ్చి పెట్టండి" అనేసి లేచింది ఛాయ. ఛాయకు అలా జ్యోతిముందు తన భర్త తనకి చీర తేలేదని చెప్పడం అవమానంగా వుంది. అలా చెప్పకపోయినా బాగుండేది.

ఏదో పనున్నట్టు లోపలికొచ్చిన ఛాయకు ఏ పని చేయాలో తోచడంలేదు. వాళ్ళ దగ్గర కూర్చోనూ కూర్చోలేకుంది. వాళ్ళనలా ఒంటరిగా వదలనూ లేకుంది.

అలా నిస్సహాయంగా కూర్చొనున్న ఛాయదగ్గరకు మెల్లిగా నడిచొచ్చింది జ్యోతి.

"అక్కా !"

తృళ్ళిపడి తలెత్తింది ఛాయ.

"ఇది .... ఇది మీకిష్టమేనా ?"

క్షణం జ్యోతి కళ్ళల్లోకి కన్నార్పకుండా చూచిన ఛాయ ఈసారి నటించలేకపోయింది.

"నాకిష్టం లేకపోతే నువ్వు మానేస్తావా ?"

జ్యోతి జవాబివ్వలేదు.

జ్యోతి వెళ్ళిపోయాక, జ్యోతిని దిగబెట్టటానికి ఆమెవెంట తన భర్త వెళ్ళిపోయాక, ఇంతవరకు మంచిపేరుమీద మమకారంతో, కొద్దిపాటి సంస్కారంతో, బిగబెట్టుకున్న ఆవేదనంతా కన్నీటిరూపంలో బయటకొచ్చింది ఛాయకు.

'ఊహుఁ జ్యోతి ఆయన్ను వదులుతుందా? తన పర్మిషన్ అందుకున్న రాజా ఇక ఆమెను వదులుతాడా ? తన జీవితమిక ఇంతే. ఎంత పొరపాటు చేసింది తను. అప్పుడే గట్టిగా చెప్పేయాల్సింది వీలుకాదని.'

'ఆ రోజు అతనిమీద మమకారంతోనో, ఆవేశంతోనో, విరక్తితోనో– అన్నీ కలిసిన భావావేశంతోనో 'అలాగే మీ ఇష్టం' అంది. ఎంత పొరపాటు జరిగిపోయింది.

జ్యోతిని, రాజాను ఒకదగ్గర చూస్తూ తను భరించగలదా ? రాజాను కాదనుకుని తను బ్రతగ్గలదా ? ఏం చేయాలితను ? తన జీవితాన్ని భద్రపరచుకునేందుకు తనేం చేయాలి ?

ఆమె తల బ్రద్దలయిపోతోంది. ఏడ్చి, ఏడ్చి ఆమె కళ్ళు ఎండిపోయాయి.

ఉషారుగా, మంచిస్పీడ్‌తోవచ్చి స్కూటర్‌కి స్టాండ్ వేసి ఇంట్లోకి నడవబోయిన రాజారావుకి నీరసం వచ్చేసింది. తామిద్దరూ కలిసి బయట కెళ్ళేప్పుడు వాడే నవతాళ్ లాక్ వేలాడుతోంది తలుపుకు.

ఛాయ ఎప్పుడూ ఎక్కడికీ ఒంటరిగా సాధారణంగా వెళ్ళదు.

ఆలోచిస్తూ, బాల్కనీలోకి వెళ్ళి మెట్లమీద కూర్చున్నాడు. రెండు నిమిషాలు గడిచేసరికి జ్యోతి ఆలోచనలు అతన్ని కప్పేసాయి. 'ఇప్పు డిప్పుడే జ్యోతి తనతో చనువుగా వుంటోంది. పెళ్ళి చేసుకుంటాడనే నమ్మకం ఛాయను చూసాకగానీ జ్యోతికి కలగనట్టుంది' నవ్వుకున్నాడు రాజారావు. ఇప్పుడు అతనికి జీవితం మరో రంగుల హరివిల్లులా వుంది. ఈరోజు ఎన్ని కబుర్లు చెప్పింది జ్యోతి! తమ భావిజీవితంగురించి — తను ఛాయ ఇష్టప్రకారమే నడుచుకోబోయే వైనం గురించీ — ఆఫీస్ అయిపోయాక రెండు గంటలసేపు అక్కడే తామున్నట్టు ఇద్దరికీ గుర్తు లేదు. 'ఫ్యాన్స్ చూస్తారు ఇక్కడెందుకు? అలా పార్కు కెళ్దాం రమ్మం'టే రాదు. ఉత్త పిరికిది. 'పెళ్ళయ్యాక వెళదాం లెద్దురూ' అంటుంది. అని తన కాబోయే భార్య పిరికితనానికి చాలా ఆనందిస్తున్నాడు రాజారావు.

"అయ్యో! మీరొచ్చేసారా? ఎంతసేపయిందండీ వచ్చి?" అన్న భార్యనుచూసి తర్వాత టైమ్ చూసుకున్నాడు రాజారావు. తనొచ్చి అప్పుడే గంట అయింది. జ్యోతి ఊహల్లో తనకంత టైమ్అయినట్టే గుర్తులేదు. నేలమీద చతికిలబడి పడున్నాడనే ధ్యాసే లేదు.

"ఇప్పుడే ఎక్కడికెళ్ళావ్?" అంటూ ప్యాంటుకంటుకున్న దుమ్ము దులుపుకున్నాడు.

ఛాయ జవాబు చెప్పకుండా ఎంతకీరాని తాళంకప్ప తీసే ప్రయత్నంలో వుంది.

"ఏదీ ? ఇలా ఇవ్వు నేను తీస్తాను" అంటూ భార్యచేతిలో తాళం అందుకున్నాడు రాజారావు. అతనికి ఈరోజు చాలా ఉషారుగా వుంది.

ప్యాంటు మార్చుకుని లుంగీ కట్టుకుంటూ ఏకంగా వంటింట్లోకొచ్చి పీటమీద కూర్చున్నాడు.

"ఛాయా ! చాలా ఆకలిగా వుంది. అన్నం వడ్డించేయ్, ఈరోజు టిఫిన్ వద్దు."

"అయ్యో ! అన్నం ఇంకా వండలేదండి. మీరు నాకు సాయం చేసారంటే ఎంత చిటికెలో చేసేయనూ ?"

రాజారావుకంటే ఉషారుగా వుంది ఛాయ. ఈ రోజు ప్రత్యేకంగా తయారయ్యింది పెళ్ళయినక్రొత్తల్లో తయారయినట్టు. పైగా మత్తెక్కిస్తూ తలల్లో తట్టెడుమల్లెపూలు ఛాయపైపునుండి రాజారావు చూపులు మరల్చుకో లేకుండా వున్నాడు. పదిరోజులనుండి ఛాయ చాలా విరక్తిగా వుంటోంది. ఈరోజు ఛాయలో హఠాత్తుగా చాలా మార్పు.

"దేవిగారు చాలా బాగున్నారు. ఎక్కడినుండి ? గుడినుండా ?" ఉల్లిపాయలబుట్టముందు బాసింపట్టు వేసుకుకూర్చుని ఉల్లిపాయలు ఒలిచే ప్రయత్నం చేయబోతూ అడిగాడు. ఛాయ అలా ఉషారుగా వుండడం రాజారావుకి సంతోషంగా వుంది. అతనిలో గిల్టీనెస్ కొద్దిగా తగ్గినట్టయింది.

"గుడినుండి కాదండీ మీరెంతసేపటికీ రాకపోతే విసుగొచ్చి అలా భారతివాళ్ళింటికి బయలుదేరాను. ప్రక్క వీధిలో కృష్ణారావు మీకు తెలుసు కదూ !...."

"కృష్ణారావా ?"

"ఆఁ మర్చిపోయారా అప్పుడే .... మన ప్రక్కింటి అమృతగారి తమ్ముడండీ. వాళ్ళింట్లో మొన్న ఫంక్షన్‌కి మనం వెళ్ళలా ? అప్పుడు అత

నితో మీరు చాలాసేపు మాట్లాడారు కూడాను. నేనప్పుడు గమనించలేదు గానీ, అతను చాలా అందగాడే సుమండీ."

రాజారావు కనుబొమలు ముడిపడ్డాయి. ఉల్లిపాయమీద తొక్క కాకుండా ఉల్లిపాయ రెమ్మలన్నీ ఒలిచి పారేస్తున్నాయి అతని చేతులు.

"పాపం అతనికి చలిజ్వరం వచ్చిందండీ." మరిగిన ఎసరులో బియ్యం వేస్తూ వేస్తూ ఆగి వెనక్కు తిరిగి చెపుతున్న భార్యను 'మరి చెప్పనీ లేదు' రాజారావు.

"భారతి సంగతి చెప్తూ కృష్ణారావు టాపిక్‌లోకి వెళ్ళిపోతున్నావు."

"భారతి ఇంటికి నేను సొంతంవెళితే కదా !" అంటూ బియ్యం ఎసురులో పూర్తిగా పోసేసి, ప్రక్కనవున్న సింక్‌లో చేతులు కడుక్కుని, టవలుకి తుడుచుకుంటూ వచ్చి భర్త ప్రక్కనే కూర్చుంటూ విస్తుపోయింది.

"అయ్యో ! ఇదేమిటి ? దబ్బనిమ్మకాయంత ఉల్లిపాయను ఉసిరి కాయంత చేసారు. చాలు చాల్లెండి లేవండి. ఇలా అయితే సంసారం చేసి నట్టే!"

కళ్ళెత్తి చురుగ్గా చూసి చేతిలో కరిగిపోయిన ఉల్లిపాయను మరలా బుట్టలో పారేసాడు.

"చెప్పు."

"ఏం చెప్పనూ ? .... ఓ....అదా ! నేను భారతి ఇంటికెళుతుంటే కృష్ణారావుగారిల్లు కాబోలది. అమృతగారు వాకిట్లో నిల్చొని గాభరాగా అటూ ఇటూ చూస్తున్నారు. నేను కనపడగానే ముఖం ఇంత చేసుకుని - 'ఛాయగారూ ! కాస్త మా తమ్ముడు దగ్గరుంటారా ? వాడికి చలి జ్వరం వచ్చింది. మా ఫ్యామిలీ డాక్టర్‌గార్ని పిలుచుకొస్తాను. ఒక్కణ్ణీ వదిలి వెళ్ళలేక ఇలా నిల్చున్నాను' అనేసి ....

"అయ్యో నా మతిమండా! మీకసలే ఆకలేస్తోందంటిరి. మరో పొయ్యి వెలిగించి, పప్పుకాస్త పడేస్తే ఉడుకుతూ వుంటుందికదా!" అని లేవబోయిన భార్యను లేవనీయలేదు రాజారావు.

"పప్పు ఉడక్కపోతే ప్రపంచం మునిగిపోదులే, ఆ తర్వాతేమైంది? వదిలేసీ ..."

"ఆఁ వదిలేసీ .... నేను ఓ.కె అనకముందే రిక్షా కేకేసుకుని వెళ్ళిపోయిదండీ. నాకు కాస్త సంకోచం అన్పించినా మొదట్లో, ఇలాంటప్పుడు కాకపోతే మనిషికి మనిషి మరెప్పుడు సహాయం చేసుకునేదని .... అయ్యయ్యో చెప్పరేమండీ అలా అన్నం పొంగిపోతుంటే ఎదురుగా కూర్చొనీ ....

"అబ్బ చెప్పయినా వంటచెయ్యి, వంట చేసయినా చెప్పు. ఏమిటీ నాన్చుడు వ్యవహారం? ఇక శాంతంగా వుండడం తలకిమించిన పనై అలా విసుక్కున్నాక తేరుకున్నాడు రాజారావు.

'ఛ పాపం అలా విసుక్కోకుండా వుండాల్సింది' అని. కానీ తను విసుక్కుంటే చిద్విలాసంగా చూస్తున్న శ్రీమతే అతనికి క్రొత్తగా వుంది. అసలు తనెప్పుడూ ఛాయను అంతగా కోప్పడడు. ఛాయ అసలు తను కోప్పడే అవకాశమే తనకివ్వదు. ఎప్పుడైనా కొద్దిగా విసుక్కున్నా త్వరగా అఫెండ్ అవుతుంది ఛాయ. అలాంటిది ఈరోజు, అంత కోప్పడ్డా చెరగని చిరునవ్వుతో వుందంటే, ఛాయ గుండెల్లో ఎంత ఆనందముందో ?

"అయితే పదండి. అలా కూర్చుని ఏదైనా పనుంటే చూసుకోండి. అన్నం వండేసి, ఇద్దరం కృష్ణారావు కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిందాము."

"నేనంత సేపుండలేను. నాకు ఆకలిగా వుందని చెప్పలేదూ! మజ్జిగ పొయ్యి చాలు."

రాజారావు ఎంత నిగ్రహించుకున్నా అతని కంఠంలో విసుగు, కాఠిన్యం చోటు చేసుకుంటూనే వున్నాయి.

"అయ్యో! అదేంటండి ఎంత సేపనీ! ప్లీజ్ ఒక్క ఐదు నిముషాలు. గ్యాస్‌మీద పప్పు ఎంత సేపు ఉడుకుతుంది? అదిగో అన్నం ఉడకనే ఉడికిపోయింది. వార్చేసి ఆ పొయ్యిమీద ఎగ్ పడేస్తాను. బుద్ధిమంతుళ్ళా అలా కూర్చోండి" అనేసి భర్త ఇష్టా ఇష్టాలతో ప్రసక్తిలేకుండా పప్పు ఉడకబెట్టేసి అన్నట్టుగానే పది నిమిషాల్లో భర్త ప్లేట్లో అన్నం పెట్టేసింది ఛాయ.

అయిష్టంగా తింటున్న రాజారావుకు తన భార్య చెపుతున్న కబుర్లు ఇంకా అయిష్టంగా వున్నాయి.

"పాపం జ్వరం నూట నాలుగుమించి వుండచ్చు. మన రాముకి ఒక సారి జ్వరంవస్తే చన్నీళ్ళతో ఒళ్ళు తుడవమన్నారు డాక్టరు. అది గుర్తొచ్చి చుట్టూచూస్తే చల్లటి కూజా వుంది. ఆ నీళ్ళలో టవల్ ముంచి ఒళ్ళు తుడుస్తూ కూర్చున్నాను."

"ఊఁ కాస్త ఉప్పెయ్."

"చెయ్యి అడ్డు తీయండి చేతిలో ఉప్పేస్తే మనిద్దరికీ తగువు వస్తుందట."

విసురుగా చెయ్యి తీసాడు రాజారావు.

"వాళ్ళక్క అనుకున్నాడో ఏమో, నా చెయ్యి గట్టిగా పట్టుకుని ఒకటే అనడం -'నన్నొదిలి పోవద్దు' నన్నొదిలి పోవద్దు' అని. భలే జాలేసిందండీ నాకు."

"ఈ రోజు నాకు మంచినీళ్ళిస్తావా ?"

"అయినా ఏం మగాళ్ళండీ బాబూ ! ఆ చిన్న జ్వరానికే ఎంత హంగామా చేసాడనీ ఆ కృష్ణారావు."

మంచినీళ్ళు తెచ్చి అతని ప్లేట్ ప్రక్కన పెట్టి -

"మీకు మాగాయ ఇష్టంకదూ ! ఈరోజు కూరలేం లేవు. వుండండి తెస్తాను" అని చెంగు బొడ్లో దోపుకుంటూ కదిలింది.

"నా భోజనం అయిపోయింది మధ్యలోనే లేస్తున్న భర్తనుచూసి ఈసారి బాధపడిపోలేదు ఛాయ. సన్నగా నవ్వింది. ఆ నవ్వు ఆవకాయ కంటే కారంగా అన్పించింది రాజురావుకి.

# 7

"అక్కా !"

"ఎవరూ ? వస్తున్నా" లోపలినుండి ఛాయ కంఠం. లేచి తలుపుతీసి తమ్ముణ్ణిచూసి ముఖం చాటంత చేసుకుంది ఛాయ.

"అరె! నిర్మలకూడా వచ్చిందా నా అల్లుడేడీ ?"

"వాళ్ళమ్మమ్మ దగ్గరుండిపోయి రాలేదు వదినా" అంది నిర్మల.

"అక్కా ! బావగారింకా ఆఫీసునుండి రాలేదా ఆరు గంటలయినా"

ఒక్క క్షణం జ్యోతి మనసులో మెదిలింది ఛాయకు. కానీ వెంటనే "మీ బావగారికి సంపాదన పిచ్చి పట్టిందిరా ఓవర్ టైమ్ చేస్తున్నారు" అనేసింది.

"మాటల్లో మీకు మంచినీళ్ళయినా ఇచ్చానుకాదు. రామ్మా నిర్మలా, లోపలికెళదాం."

"చూడక్కా ఈసారికి మమ్మల్ని వదిలేయాలి నువ్వు. నెక్స్ట్ టైమ్ వచ్చినపుడు తీరిగ్గా వుంటాము."

"అలా వదిలేది లేదు గానీ ఆ బుక్ చదువుతూ కూర్చో, పది నిముషాల్లో పకోడీలు వేసి తెస్తాను."

మరో ముప్పై నిముషాల్లో ఛాయ, నిర్మల హాల్లోకి వచ్చేసరికి మురళి కాల్చిన సిగిరెట్లు కుర్చీచుట్టూ పరచుకున్నాయి.

"ఇదేమన్యాయంరా మరీను ....

నీవయినా వాడికీ పాడు అలవాటు మాన్పుతావనుకున్నాను నిర్మలా" అంది విసుగ్గా తమ్ముడివంక చూస్తూ.

"అలా వినేరకం కాదులే వదినా ! మీ తమ్ముడుగారు" అని చిన్నగా నవ్వింది నిర్మల.

"బావగారొస్తే చెప్పక్కా నేనొచ్చానని" అంటూ యిద్దరూ లేచారు.

ఇదేం రావడం ? ఇదేం వెళ్ళడం ? అంటూ గుమ్మందాకా వెళ్ళి వాళ్ళను సాగనంపి అలాగే నిల్చుండిపోయింది ఛాయ.

"ఛాయా ఇక్కడ నిల్చుండిపోయావేం" తృళ్ళిపడి,

"స్కూటర్ ఏమయింది" అటూ ఇటూ చూస్తూ అంది ఛాయ.

"మరి నీవు కోప్పడనంటే చెప్తాను."

"చెప్పండి."

"నేను జ్యోతి కలిసి బీచ్‌కెళ్ళాము. తిరిగి వచ్చేవరికి ఏ తుంటరి వెధవో స్కూటర్ టైర్ కోసేసాడు.

కొద్దిగా అయినా ఛాయను బాధకల్గుతుందేమోననే శంక వుండుంటే ఆ కళ్ళలో ఆ మెరుపుండేది కాదతనికి.

"మనం ఓ నిర్ణయానికొచ్చాక కోపం ఎందుకండీ ?"

వెనక్కి తిరుగుతూ ఛాయ యిచ్చిన జవాబు రాజారావును చాల ఆశ్చర్యపరచింది.

"నీవెంత మారావు ఛాయా ! మొదట్లో బాధపడ్డావుగానీ. అయినా ఇందులో బాధపడాల్సిందేముంది చెప్పు ? నీవెంతో జ్యోతి అంతే నాకు. యిద్దర్నీ రెండు కళ్ళులా చూసుకుంటాను. ఎక్కడికెళ్ళినా ముగ్గురం కలిసే వెళదాం. ఏం ? ఇద్దరూ కావాలి నాకు" ఛాయ భుజాలచుట్టూ చెయ్యివేసి లోపలికి నడిపించాడు.

హాల్లో అడుగుపెట్టగానే సిగిరెట్ పీకలు, టిఫిన్ ప్లేట్లు స్వాగతం పలికాయి.

"ఎవరో అతిధిదేవతలు వచ్చినట్లున్నారే ?" అని ఆగి ఈ రోజు జ్యోతి ఎంత సరదాగా కబుర్లు...." అని జ్యోతి కబుర్లు చెప్పబోతున్నాడతను.

"జ్యోతంటే గుర్తు వస్తోందండీ పాపం, కృష్ణారావు భార్యపేరు కూడా జ్యోతేనంటండీ. మూడునెలల క్రితం వాళ్ళ పుట్టింటికెళ్తూ వుంటే ట్రైన్ యాక్సిడెంట్‌లో చనిపోయిందంటండి. ఇంతకీ పెళ్ళయి అప్పటికి మూడు నెలలేనట."

"కృష్ణారావు ఇంటికి మళ్ళా వెళ్ళావా ?"

రాజారావు అదృష్టం, చీకట్లో అతని ముఖభావాలు ఆమెకు కన్పించకుండా కరెంటు కోత.

"ఉండండి క్యాండిల్ వెలిగించి తెస్తాను."

"........" గదినిండా క్యాండిల్ పరచిన సన్నటి వెలుతురు.

"ఆఁ ఏమిటన్నారు కృష్ణారావు ఇంటికెళ్ళావా అనేనా? అమృతగారు

నా సహాయం గురించి చెప్పారట. కోలుకోగానే నాకు థాంక్స్ చెప్పడానికి వచ్చాడు. పాపం చాలా చిక్కిపోయాడండీ. అబ్బ ! అతను మాట్లాడుతూ వుంటే రెప్పవేయకుండా చూస్తూ వినాలన్పించిందనుకోండి. మాట్లాడిన టాపిక్ మాట్లాడకుండా కబుర్లు చెప్పాడు. అసలు నాకు బయట చీకటి పడిందనే తెలియలేదు సుమండీ. అతని కబుర్లు వింటుంటే .... 'మళ్ళా అప్పుడప్పుడూ రండి. ఆదివారం అయితే మా శ్రీవారుకూడా వుంటార'ని చెప్పాను."

"ఏదో చెప్పబోయారు ఇందాక మీరు"

"ఏమీ లేదులే. ముందు నువ్వెళ్ళి నా స్నానానికి నీళ్ళు తోడు."

"తోడ్తానుగానీ ఇంతలో సిగిరెట్ వెలిగించడమెందుకండీ .... అన్నట్లు సిగరెట్ చూస్తే గుర్తొచ్చింది. ఆ కృష్ణారావుకూడా చైన్ స్మోకర్ అనుకోండి. చూడండీ ఎన్ని సిగిరెట్ పీకలో ఆరోగ్యం చెడిపోతుందండీ త్రాగకండీ, అని మీకు చెప్పినట్లే చెప్పాను. పాపం చాలా డీలాగా 'సారీ ఛాయగారూ ! నాకీ అలవాటు జ్యోతి పోయినప్పటినుండి ఎక్కువయిపోయింది. మీ మాట ప్రకారం తగ్గించడానికి ప్రయత్నిస్తాను' అని ఎంతో బుద్ధిగా అన్నాడు...." అతను నయంకదా మీకంటే. చెప్పగానే ప్రయత్నిస్తానన్నాడు. మీకు చెప్పిచెప్పి నోరు పోతుందేకానీ వినరుకదా !"

"పరాయి ఆడది ఏది చెప్పినా స్వీట్‌గానే వుంటుందిలే మగాడికి—" విసురుగా టవల్ భుజాన వేసుకుని బాత్‌రూమ్‌లో కెళ్ళిపోయాడు. అలా వెళ్తున్న భర్తను చూసి పైకి సన్నగా నవ్వుకుంది కానీ ఛాయ గుండెల నిండా ఏదో బరువు, ఇష్టంలేని పని బలవంతంగా చేస్తున్న వెలితి, అసంతృప్తి.

* * *

భర్త కౌగిట్లో వున్న ఛాయకు చాలా అసహనంగా వుంది. అతను అరగంటగా ఏవేవో కబుర్లు చెపుతూనే వున్నాడు. అలా రోజంతా ఎవరికి వారే కష్టపడి ఏ అర్ధరాత్రో ఒకరి కౌగిట్లో ఒకరు ఒరిగిపోయి ఒకరి కబుర్లు మరొకరు ఆసక్తిగా వినటం, 'నువ్వే, నేను', 'నేనే నువ్వు' అన్నట్టుగా మాట్లాడుకోవడం ఛాయకు ఎంతో ఇష్టమైన సంగతైనా, ఇలా భర్త కౌగిట్లో, ఓ పరాయి ఆడదానిగురించి వినడం ఛాయకు బొత్తిగా నచ్చడం లేదు.

"ఇక నువ్వు పిలిచినచోటికల్లా నేను రానంటున్నానని నువ్వు బాధ పడక్కరలేదు. మీరిద్దరూ కల్సి షాపింగ్‌కి వెళ్ళొచ్చు, సినిమాకెళ్ళొచ్చు, మీ ఫ్రెండ్స్ ఇళ్ళకెళ్ళొచ్చు" అతనలా చెప్తోంటే కళ్ళెత్తి చిరాగ్గా చూసింది ఛాయ.

'మభ్యపెట్టేదానికైనా కాస్త తెలివుండాలి. ఎంత ఆకర్షణ మత్తులో వుంటే మాత్రం అవన్నీ విని ఆనందించడానికి తనేం పసిపిల్లనా ?'

"స్కూటర్ అమ్మేసి కారు కొనుక్కుందాం నిదానంగా"

ఛాయ మాట్లాడలేదు. ఈ మధ్య నటన ఎంత అనివార్యం అయిపోయినా, ఒక్కోసారి, తనకది శక్తికిమించిన పని అయిపోతోంది.

"ఏం ఛాయా ! మాట్లాడవు ?"కాస్త భుజం ఎత్తి తలవంచి, ఛాయ బుగ్గమీద సుతారంగా రాస్తూ అడుగుతున్న భర్త కళ్ళల్లోకి క్షణంచూసి నిదానంగా అంది ఛాయ.

"మీరిమధ్య ఏది మాట్లాడినా జ్యోతి విషయంతప్ప మరేదీ వుండడంలేదు అందులో."

మొదట కాస్త కంగారుపడ్డాడు రాజారావు. తర్వాత నవ్వేస్తూ అన్నాడు.

"మరలా అసూయపడుతున్నావ్ కదూ ! ఛాయా ! నిజమే నువ్వలా అంటూంటే నాకూ నిజమనిపిస్తోంది. అలా అని నిన్ను నెగ్లెక్ట్ చేస్తున్నా ననుకోకు. నిజం చెప్పాలంటే నాకూ జ్యోతికీమధ్య ప్రస్తుతం వున్నదీ ఎక్కువగా ఆకర్షణ. ప్రకృతిసిద్ధంగా ఒక ఆడదానికీ, ఒక మగాడికీ మధ్య ఆకర్షణ వుండి తీరుతుంది. దానిని తప్పంటారు అందరూ. కానీ నా ఉద్దేశంలో అది తప్పుకాదు. అది నేచురల్ ఇన్‌స్టింక్ట్."

వెర్రిగా చూసింది ఛాయ.

"ఛాయా ! నువ్వు కాస్త ఆ అసూయను ప్రక్కకు నెట్టెయ్. మనం దరం సుఖపడతాం, ప్లీజ్!"

అతను ఆమెను చుట్టుకుంటున్నాడు.

"ఛాయా ! ఛాయా ! నువ్వంటే నాకు చాలాఇష్టం. నువ్వు లేకుంటే నేను బ్రతకలేను."

ఛాయ కరిగిపోతోంది.

"ఛాయా ! నువ్వు చాలా బాగున్నావీరోజు కానీ ఈ మధ్య నీ చర్మం రఫ్‌గా తయారవుతోంది. ఏదైనా క్రీమ్ కొనుక్కొని రాసుకో కూడదూ ?"

ఛాయ అతనిలో ఐక్యమైపోతోంది.

"జ్యోతి చెర్మం చాలా స్మూత్‌గా వుంటుంది ఛాయా."

ఛాయకు తెలివొచ్చింది. అతన్ని నెట్టేసి లేచింది.

* * *

ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చిన అమ్మనుచూసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ఛాయకు. ఈ మధ్య నిజమైన ఆప్యాయతకు వాచిపోతున్నట్లుగా

వుంది ఆమెకు. ఒక్క క్షణం ఆమెను వదిలిపెట్టకుండా తిరిగింది, కబుర్లు చెప్పింది.

"ఈ చీర నచ్చిందా ఛాయా ? అల్లుడికి నచ్చుతుందో లేదో ?" అంటూ చిగురుపచ్చకు మెజంతా బార్డర్ వున్న కంచి కతాన్ చీర కూతురు కందించింది.

"ఏమిటిది మమ్మీ ! నీ చాదస్తం. పెళ్ళయి ఆరు సంవత్సరాలయినా ఎప్పుడొచ్చినా నాకు చీర తేవడం మర్చిపోవు కదా !" అంటూనే దాని అందాలు త్రిప్పిచ్చి మర్లించి చూసుకుంటోంది ఛాయ.

ఛాయకు క్రొత్తచీర కట్టందే మనసు నిలవదు. అప్పుడే ఆ చీర అంచుకు పసుపురాసి స్టాండ్‌మీద పడేసి బాత్‌రూమ్‌వైపు నడిచింది. తలారా స్నానంచేసి తల చిక్కుతీసుకుని దొడ్లో పూచిన సన్నజాజులు కోసుకుని డాబామీద ఎక్కి తలార్పుకుంటూ, పూలు కట్టుకుంటూ ఆలోచిస్తోంది.

వరండాలో చల్లటి గాలికి రెండు కుర్చీలు వేసుకుని తీరిగ్గా కూతురుతో కబుర్లు చెపుతున్న వర్ధనమ్మకు ఇప్పుడు గుర్తుకొచ్చింది కాబోలు హఠాత్తుగా లేచి –

"ఛాయా ! తలుపేసుకో మన ప్రక్కింటి బామ్మగారి మనుమరాల్ని ఈ ఊర్లో ఇచ్చారు చూసొస్తాను. రేపు మరలా ఎండ" అనేసి ఆమె వెళ్ళిన మరో పది నిముషాల్లోనే రాజారావు వచ్చాడు. వస్తూనే పట్టుచీరతో ఎప్పుడూ బయటకు తీయని చంద్రహారంతో, ఐషేడ్ వేసిన మెరిసేకళ్ళతో వదులుగా వేసిన జడలో సన్నజాజుల గుబాళింపులతో ఎదురొచ్చిన శ్రీమతిని చూసి – భారంగావున్న అతని మనసు సేద తీర్చుకుంది.

పది నిమిషాలక్రితమే జ్యోతివల్ల అతని మనసు కాస్త దెబ్బ తింది.

'నీకో మంచి చీర కొనిపెట్టాలి షాపింగ్‌కి వెళ్దాం' అని ఎంతో ఉషారుగా అన్న రాజారావు ఉషారును చంపేసింది జ్యోతి.

"సారీ రాజారావ్ ! అన్నీ సక్రమంగా జరిగితే ముగ్గురం కలిసే వెళదాం. ఇప్పుడు రావాలనిలేదు. ఏమనుకోకు."

చాలా అవమానంగా ఫీలయ్యాడు రాజారావు.

తనెంతో ప్రేమగా ప్రజెంటేషన్ ఇస్తానంటే ఎంతో ఆనందపడి పోయి అంగీకరిస్తుందనీ, మరుసటిరోజు తన కోరికమీద ఆ చీర ఆఫీస్‌కు కట్టుకొస్తుందనీ ఎన్నెన్నో మధురంగా ఊహించుకున్న తనకు ఎంత అవమానం ఇది.

మారుమాట్లాడకుండా ఆఫీస్ వదలగానే ఇంటికి బయలుదేరాడు. ఈరోజు తను ఛాయతో ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటూ ఇంటికొచ్చాడు. ఇంటికిరాగానే ఛాయ కడిగిన ముత్యంలా వుంది.

"ఛాయా ! పిక్చర్‌కెళ్దామోయ్ !" అనేసి ఉషారుగా లోపలికెళ్ళి పోయాడు. ఛాయ గ్యాస్ అంటించి, టీ చేసి వరండాలోకొచ్చేసరికి రాజారావు రెడీ అయి కుర్చీలో కూర్చొనున్నాడు.

టీ అందించి "ఈ చీర బాగుందా ?" చీరవైపు చూసుకుంటూ మురిపెంగా అడిగింది ఛాయ.

"నీ సెలక్షన్ ఎప్పుడూ బాగుంటుంది డియర్ ! పొదుపుచేసి ఈ నెల చాలా కాస్ట్లీ చీర కొన్నావే !"

ఛాయ బుర్రలో తళుక్కుమని చిన్న ఐడియా.

"సర్లెండి మరీ చెబ్తురు, ఎంత పొదుపుచేస్తే .... ఇంత మంచిచీర కొనగలను ? ఇప్పుడే కృష్ణ వచ్చివెళ్ళాడు. ప్యాకెట్ చేతిలో పెట్టేసి

వద్దనే అవకాశంకూడా ఇవ్వకుండా వెళ్ళిపోయాడు. ఏమైనా అతని సెలక్షన్ చాలా నచ్చింది సుమండీ నాకు. అయినా ఎప్పటినుండో ఇలాంటి చీర కొనుక్కోవాలనుకుంటున్నాను. నా మనసులో కోర్కె తెలిసినట్లు అలాంటి చీరే ఇచ్చాడు." రాజారావులో ఉషారు కరిగిపోయింది నీరసం వచ్చేసింది.

"నాకదేంటో చిన్నప్పటిమండీ 'కృష్ణా' అనే పేరు చాలా ఇష్టం." ఓరగా భర్త ముఖ కవళికలు గమనిస్తూ అంది.

"మీరు జ్యోతంటే నాకు చాలా ఆకర్షణ ఛాయా ! ప్లీజ్ నన్నర్థం చేసుకో అంటే మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను. కృష్ణని చూసాక నాకు మీరు చెప్పిన థియరీ కరక్టే అన్పిస్తోంది."

"మీరు జ్యోతిని చేసుకుంటానన్నప్పటినుండీ చాలా ఒంటరిగా ఫీల్ అవుతున్నానండీ నేను. బహుశా నా మనస్సు పడే ఒంటరితనమే అతన్ని నాకు దగ్గర చేసిందేమో ! అసలు కృష్ణతో ఎన్ని గంటలయినా గడపాలని పిస్తుంది. అతను ఎంత బాగా కబుర్లు చెప్తాడనీ ! ఎంతసేపయినా అలా వింటూ వుండాలనిపిస్తుంది. నిజం సుమండీ. ఏమిటో అనుకునేదాన్ని ఆడ, మగ మధ్య ఇంత ఆకర్షణ వుంటుందని నాకు తెలీనే తెలీదు."

రాజారావు భార్యవంక అప్రసన్నంగా చూస్తున్నాడు.

"ఈరోజు వాళ్ళ గులాబీ చెట్లమధ్యకెళ్ళాను సరదాపడి. నా బుగ్గ మీద వెచ్చటిగాలి తగిలి ప్రక్కకు తిరిగిచూద్దునుకదా కృష్ణ. నా ఒళ్ళంతా పులకరించినట్లయింది. మీతో అలవాటయిపోయిందో ఏవిటో నాకీమధ్య మీతో అలా అన్పించలేదు."

రాజారావుకు ఎవరో తనని హత్య చేస్తున్నట్లుంది.

"మీరంటారు ఆడ, మగమధ్య స్వేచ్ఛ వుండాలి. ఎవరిమీద కోర్కె వుంటే – అది తీర్చేసుకోవాలి. అని కానీ, ఏవిటో చిన్నప్పటినుండి

పాతివ్రత్యంమీద మమకారం. ఇంకా అది చావడంలేదు. అందుకే అతన్నుండి తప్పించుకుని పారిపోయి వచ్చాను."

రాజారావుకి కాస్త రిలీఫ్ అన్పించింది. పాతివ్రత్యంమీద ఆ మమకారం తన భార్యలో ఎప్పుడు చచ్చిపోతుందో అని భయంగానూ వుంది.

"అరెర కబుర్లలో పడి మర్చిపోయాం సినిమాకెళ్దామంటిరే. రండి రండి వెళ్దాం. ఇంకా టైమ్ కాలేదు. మధ్యలో కృష్ణని పికప్ చేసుకుని వెళదామా ! ప్చ్. కానీ, ఈ స్కూటర్‌తో గొడవ ముగ్గురెక్కడానికి లేదు. పర్లేదులెండి చెప్పేసి మనం వెళితే వెనక రిక్షాలో వచ్చేస్తాడు. లేవండి మరీ"

రాజారావుకి లేచే శక్తికాదు కదా, భార్యకు జవాబు చెప్పే శక్తి కూడా లేదు. తన భార్య నోటివెంట తను కలలో కూడా ఊహించని మాటలు వింటూ నీరసంగా అన్నాడు.

"నాకు బాగలేదు ఛాయా ! కాస్త థర్మామీటర్ తెస్తావా ?" అతను భార్యనుండి తప్పించుకోను అలా అంటే, భర్తనుండి తన ముఖాన్ని దూరం చేయను భర్త అడిగిందే తడవు లోపలికెళ్ళిపోయింది ఛాయ.

'ఇలా భర్త ఎదురుగా మరో పరాయి మగాడిగురించి మాట్లాడాల్సి రావడం ఎంత దౌర్భాగ్యం !'

# 8

పెరట్లో ఆ సమ్మర్‌లో బొట్లు బొట్లుగా కారుతున్న మునిసిపల్ కుళాయి నీళ్ళతో ఓపిగ్గా ఒక్కొబక్కెట్టు నింపుతున్న ఛాయకు తనప్రక్క ఇంట్లో రోజా చెట్ల కొసలను కత్తిరిస్తున్న కృష్ణ కన్పించాడు. ఆ ఇంటికి ఛాయావాళ్ళ ఇంటికి మధ్యలో కాంపౌండ్‌వాల్ లేదు. ఆ రెండు ఇళ్ళ

ఓనర్ ఒకరే అవడంతో రెండిళ్ళను ఒకే కాంపౌండ్‌లో ముచ్చటగా కట్టుకున్నాడాయన.

ఆ రోజు ఆదివారం కావడంతో రాజారావు తీరిగ్గా బెడ్‌రూమ్ కిటికీ దగ్గర కూర్చుని షేవ్ చేసుకుంటున్నాడు.

ఛాయ బాగా ఆలోచించి లాభనష్టాలు బేరీజు వేసుకుంది. మంచి చెడ్డలగురించి క్షణం ఆలోచించింది. వెంటనే అక్కడనుండి కదిలింది. తన కిటికీముందు నీడ పడడంతో అద్దంలోనుండి తలెత్తిన రాజారావుని చూచి చిరునవ్వు నవ్వింది.

"మీరు ఈ రోజిటికి బాయిలర్‌లో నీళ్ళు త్రిప్పుకుని స్నానంచేసి రెడీగా వుండండి. నేనొచ్చి టిఫిన్ పెడతాను. అమృతమ్మవాళ్ళింటికి మన కృష్ణ వచ్చాడు కాసేపు మాట్లాడేసి వస్తాను. పోనీ మీరు షేవ్ చేసుకుని రాకూడదూ, కాసేపు సరదాగా మాట్లాడుకుందాం" అనేసి భర్త జవాబు కాశించకుండానే చెంగున గెంతుతూ ప్రక్కింటిపై పెళ్ళింది ఛాయ.

అలా గెంతుతూ వెళ్ళిన ఛాయ కృష్ణ రోజా చెట్ల కత్తిరింపులనుండి తలపైకెత్తగానే ఆగిపోయింది.

ఇన్ని కబుర్లు చెప్పిన ఛాయకు కృష్ణ పూర్తిగా అపరిచితుడు.

'అతన్ని పలకరించాలి. తను అతనితో సరదాగా కబుర్లు చెప్పాలి. ఆ కమనీయమైన దృశ్యాన్ని తన భర్తదేవుడు చూడాలి. ఎలా ?'

"నువ్వు అమృతక్క తమ్ముడివి కదూ ! అచ్చు మా తమ్ముడు గుర్తొస్తున్నాడయ్యా నిన్ను చూస్తుంటే"

అంటూ చనువుగా వచ్చి తనని పలకరిస్తున్న పక్కింటి ఇల్లాలిని చూసి కాస్త తత్తరపడ్డాడు.

ఆమె పలకరింపులో ఎలాంటి వెకిలితనం అతనికి కనిపించకపోయే సరికి ఆదరంగా చూస్తూ – "మీరు ఈ ప్రక్క ఇంట్లో వుంటున్నారా ?" అని ఛాయ ఇంటివైపు చెయ్యి చాపి చూపాడు కృష్ణ.

"అవునయ్యా ! మావారి పేరు రాజారావు, యల్.ఐ.సీ ఆఫీసులో జాబ్ చేస్తున్నారు. అయ్యో అసలు విషయమే మర్చిపోయాను మా అక్క కూతురికి బర్త్ సర్టిఫికేట్ కావాలయ్యా. స్కూల్‌లో అడుగుతున్నారట. మీరు మునిసిపల్ ఆఫీసులో పనిచేస్తున్నారు కదా ! అందుకని మావారికి పని తీరికలేక నన్ను అడిగిరమ్మన్నారు. చనువుగా ఇలా వచ్చి అడుగుతున్నానని ఏమీ అనుకోకు. నేను నీకు అక్కలాంటిదాన్ని మా అమ్మాయి వివరాలు చెప్పనా ?" అంది గబగబా.

చెప్పమన్నట్టు చిరునవ్వుతో చూసాడతను.

ఆమె వివరాలు చెప్పింది. సదరు వివరాల తాలూకు పిల్లకు బర్త్ సర్టిఫికేట్ అవసరం ఇప్పుడేమీలేదు.

"చూడూ ఆ క్రింద కొమ్మ కత్తిరించు. అక్కడ పువ్వుపూస్తే చాలా అందంగా వుంటుంది" అతను వంగాడు. అందలేదు. క్రింద కూర్చుని కొమ్మ కత్తిరిస్తున్నాడు. చప్పున అతనిని కవర్ చేస్తూ నిల్చుని తన చెయ్యి ఎత్తి అతని భుజంమీద వేసినట్టు భుజంమీదదాకా తీసుకెళ్ళి తన మరో చేతితో దాన్ని కలిపేసింది. ఆ దృశ్యం దూరాన కిటికీలోంచి చూసే రాజారావులో ఎన్నెన్నో అనుమానాల్ని రేపింది 'అబ్బ ఎంత మొగ్గ వేసిందే రోజా! అని కాస్త వంగిన ఛాయ తలఎత్తి "దీనిని నేను బెంగుళూరునుండి తెప్పించాను" అంటున్న కృష్ణ - అతనిలో అనుమానాల్ని బలపరుస్తున్నారు.

"ఒకసారండీ మా ఇంటికి రోజాచెట్లు అమ్మే అతను రోజా చెట్టని చెప్పి, మందారచెట్టు ఇస్తే ముడుచుకున్న మందార మొగ్గచూసి అబ్బ ఎంత పువ్వు పూస్తుందో అని సంబరపడిపోయాను. మర్నాటికది మందారపువ్వు అని తెలిసింది" అని పకనక నవ్వింది ఛాయ.

అతనూ కాస్త బిగ్గరగానే నవ్వాడు.

ప్రక్కింటి క్రొత్త అక్క చనువు, అప్యాయత అతనికి నచ్చాయి.

"మీరెప్పుడూ రోజా ఆకులు చూడలేదా ?"

"చూసానయ్యా ! కానీ అంత పెద్ద ఎర్రటి మొగ్గ చూసాక నా కళ్ళు భ్రమ కమ్మినట్టయి మోసపోయాను."

"భలేవారే !" అని మరీమరీ నవ్వాడు కృష్ణ.

రాజారావుకి వాళ్ళ ప్రవర్తన కన్పిస్తోంది. కానీ మాటలు విన్పించడంలేదు. కొద్దిసేపటికి నవ్వు పూర్తిగా ఆపి –

"సారీ మిమ్మల్ని ఇక్కడే నిలబెట్టేసాను లోపలికి రండి" అన్నాడతను.

ఈ ఆహ్వానంకొరకే ఎదురుచూస్తున్న ఛాయ అతనితో లోపలికెళ్ళి అతన్ని సిట్టింగ్ రూమ్‌లో వదిలేసి నేరుగా వంటింట్లోకెళ్ళి అమ్మృతతో అరగంటసేపు కబుర్లు చెప్పి వస్తూ –

"వస్తానయ్యా" అంటూ గడప దిగబోతుంటే అతనూ మర్యాద కొరకు ఆమెననుసరించాడు.

'వస్తాను' అనేసి తన ఇంటిదాకా వచ్చిన ఛాయ మరలా గుర్తు చేస్తున్నట్టు వెనక్కి తిరిగి పెద్దగా రాజారావుకి విన్పించేలా అంది.

"చూడూ కృష్ణా ! మర్చిపోకు నేను చెప్పిన వివరాలు గుర్తున్నాయి కదూ ! రేపక్కడ కలుస్తాను."

అంతా చూస్తున్న రాజారావులో హఠాత్తుగా బొగ్గులబస్తా దొర్లించి నట్టున్న అంధకారం.

మర్నాడు రాజారావు సెలవు పెట్టాడు. అతనికి నిన్నటినుండి ఒక చోట కూర్చోలేక, ఒకచోట స్థిరంగా నిల్చోలేక వున్నాడు.

"ఎక్కడికి రమ్మంది కృష్ణారావును ? ఏం చేస్తారక్కడ వాళ్ళు ?"

ఇదే ఆలోచన. తన భార్య శీలాన్ని ఎవరో అపహరిస్తున్నట్టు ఆరాటపడిపోతున్నాడు. తన వస్తువును ఎవరో దొంగిలిస్తున్నట్టు అసహనంగా ఫీల్ అవుతున్నాడు.

'ఛాయ ఏమైపోతే ఏమిటీ, నాకు జ్యోతి వుంది' అని అనుకోలేక పోతున్నాడతను. 'ఛాయ నిర్మలంగా, కృష్ణ విషయాలన్నీ అతనికి చెపుతుంటే భరించలేనట్టుంటోందతనికి. ఆమెను ఎలా వారించాలో, వారించి జ్యోతితో తన ప్రవర్తనకు ఏమని సంజాయిషీ చెప్పుకోవాలో అర్థంకాక తనకలాడిపోతున్నాడు. తన మనసులో సంఘర్షణనంతా ఛాయకు చెప్పకుంటే అతని నేదో మైండెడ్ అనుకుంటుందని భయపడుతున్నాడు.

'మీరు చేస్తున్నదానికి నేను చేస్తున్నదానికి తేడా ఏమైనా వుందా ?' అని ఆమె నిలదీస్తుందేమోననే శంక అతనిని అడగనీయకుండా చేస్తోంది.

ఛాయా ఎప్పుడూ తయారవనంత అందంగా తయారయింది.

ఎప్పుడూ లేంది కనుబొమ్మలు ట్వీజ్ చేసుకుంది. కనురెప్పలమీద ఐలీనర్ పెట్టుకుంది. ఐషేడ్ వేసుకుంది లైట్‌గా లిప్‌స్టిక్ వేసుకుంది .... లేత నీలంరంగు సింగపూర్ చీరమీద లేత నీలం రంగు జాకెట్టు వేసుకుని, చెప్పుల్లో కాళ్ళు పెట్టింది.

"ఎక్కడికి ?"

అంతవరకు తన పడకమీద వాలి డ్రెస్సింగ్‌టేబుల్ దగ్గర తిరిగ్గా

తయారవుతున్న భార్యను కుతకుతలాడిపోతూ చూస్తున్న రాజారావు అడి గాడు.

"అలా కృష్ణతో మ్యూజియందగ్గరకెళ్ళొస్తాను. ఎంచక్క ఈరోజు మీరుకూడా సెలవుపెట్టి ఇంట్లోనే వున్నారు. ఈరోజు ఇల్లు లాక్ చేయా ల్సిన పనిలేదు."

అతనేదో అనబోతున్నాడు. చాలా కోపంగా అనబోతున్నాడు. చెప్పుల్లో కాళ్ళు దూర్చడం పూర్తిచేసిన ఛాయ "ఈరోజు జ్యోతి వస్తానని మీకు చెప్పమంది. మర్చేపోయాను మీకు చెప్పడం." అంది.

జ్యోతి వస్తానన్న ఆనందం కలగలేదు రాజారావులో. తను కోపంగా అనాలనుకున్నది జ్యోతితో తన స్నేహం గుర్తుకు రావడంతో ఆపేసాడు.

"ఇల్లు జాగ్రత్తండీ, వస్తానండీ. ఈసారివారం మీరు, నేను, జ్యోతి కృష్ణ ఎంచక్క ఎక్కడికైనా వెళదాం వస్తానూ .... ఆమె వెళ్ళిపోయింది. రాజారావులో సర్వశక్తుల్నీ తనతో తీసుకుని మరీ వెళ్ళిపోయింది.

* * *

"ఏవండీ !"

"ఊ"

"ఏవిటి పరధ్యానంగా వున్నారు ?"

"ఏవీలేదు."

"జ్యోతిని ఎప్పుడు పెళ్ళి చేసుకుంటారు ?" మంచంమీద భర్త కెదురుగా బోర్లా పడుకుని కాళ్ళు పైకెత్తి ఆడిస్తూ మురిపెంగా అడుగు తోంది ఛాయ.

"ఏమో !"

"ఏమో ఏమిటండీ ? ఎవరైనా శాస్త్రిలుగారితో మాట్లాడిరండి. మంచిరోజుచూసి పెళ్ళి చేసుకొందురు గాని, నాకూ మీ ఒక్కరితో బోర్ కొడుతోంది" లేచి కూర్చుంది ఛాయ.

ఈసారి రాజారావులో చలనం కలిగింది. 'ఏమంటోంది ఛాయ ? మీరు క్షణం ఆలస్యం చేసినా నాకు బోరు కొడుతుంది బాబూ ఇంట్లో ! అనే ఛాయ ఇప్పుడేమంటోంది ?'

రాజారావును హఠాత్తుగా చాలా నీరసం ఆవహించింది. అతనికి చాలా దిగులుగా వుంది. తన ఛాయ తనకు దూరమైపోతుందనే భావమే అతనికి భరించరానిదిగా వుంది.

"ఛాయా ! ప్లీజ్ అలా అనకు నేను భరించలేను" అని చెప్పేయాలనుంది.

ఛాయను తనచేతులారా తానే పోగొట్టుకుంటున్నాననే పశ్చాత్తాపమూ అతనిలో వుంది.

"ఏం మాట్లాడరు ? త్వరగా పెళ్ళిచేసుకోండి బాబూ ! ఓ మంచి ఇంట్లోకి మారిపోదాం. కాస్త ఛేంజ్ వుంటుంది. అన్నట్టు మన కృష్ణ ఓ ఇల్లు ఖాళీగా వుందని చెప్పాడు" భర్తకి మరింత దగ్గరగా జరుగుతూ అంది ఛాయ.

ఛాయ నిమిషనిమిషానికి తనకి దూరమయిపోతునట్టనిపిస్తోందతనికి ఎందుకనో అతనికి ఛాయమీద కోపం రావడంలేదు.

"అన్నట్టు ఈ జోక్ చెప్పలేదుకదూ మీకు. నిన్న కృష్ణ నా చేతులు పట్టుకుని, నువ్వులేందే నేను బ్రతకలేను ఛాయా" అని ఏడ్చేసాడు.

"మనం పెళ్ళి చేసుకుందాం ఛాయా ! అంటాడు ఎంతసేపటికీ.

అదెలా కుదురుతుంది చెప్పండీ. మీరపార్థం చేసుకోరనుకోండి లోకం ఏమనుకుంటుంది ?"

లోకం ఏమనుకోకపోతే ఛాయకు కృష్ణను పెళ్ళి చేసుకోవాలనే వుందన్నమాట. తనని వదిలి వెళ్ళిపోవడానికి సంఘం సంగతి వదిలేస్తే ఛాయకేమీ అభ్యంతరం లేదన్నమాట.

అతనిని దిగుల్లూ, నీరసమూ, పశ్చాత్తాపము కలిసి పూర్తిగా అతణ్ణి అశక్తుణ్ణి చేసేసాయి.

"ఏవండీ మాట్లాడరూ ?"

రాజారావుకి ఏం చెప్పాలో తోచలేదు.

"పోనీ చేసుకోరాదూ !" అన్నాడు.

ఆమె ఏం రెస్పాన్స్ ఇస్తుందో అని ఆతృతగా ఎదురుచూసాడు.

అలా అనేసాక ఏమంటుందో, అని విలవిలలాడిపోయాయి అతని గుండెలు.

ఛాయ మొదట విస్తుపోయింది. ఆ తర్వాత అసహ్యంగా చూసింది ఆ చూపు అతనికి బొత్తిగా క్రొత్తగా వుంది. తను విశాలహృదయంతో అనగానే ఆరాధనగా చూస్తుందనుకున్నాడు. ఛాయ తనను తాను నిగ్రహించుకుంది.

"చేసుకోమంటారా ? ఊహుఁ మిమ్మల్ని వదిలి వుండలేనులెండి" ఆమె జవాబు చాలా నచ్చింది రాజారావుకు. చాలారోజుల తర్వాత నిజమైన ఆనందం కన్పించింది అతని ముఖంలో. కానీ ఆ వాక్యం వదిలి ఊరుకోలేదు ఛాయ.

"అల్లా అని కృష్ణనీ వదులుకోలేననిపిస్తోంది. పోనీ ఓ పనిచేయ

కూడదూ, మనం నలుగురం కలిసి ఒక ఇంట్లో వుంటే ఎలా వుంటుందం టారు ?"

"ఒకే ఇంట్లోనా ?" అఘాతంలో పడిపోయాడు రాజారావు.

"జ్యోతి వచ్చాక రెండు బెడ్‌రూమ్స్‌వున్న ఇల్లు తీసుకోవాలి ఛాయా అని మీరంటుంటే ఎందుకు వృథా ఏ హాల్‌లో పడుకుంటే గడిచి పోదూ ! అనుకున్నానుగానీ - నిజమేనండీ ఓ మంచి ఇల్లు చూడండి. కృష్ణ వస్తే ఇల్లు చాలదు."

ఆలోచిస్తున్నట్లుగా ఆగిపోయింది ఛాయ.

"ఇప్పుడు మనం నలుగురంకదా ! ఇంకో స్కూటర్ కొనుక్కుందా మండీ. వద్దు వద్దు ఏకంగా కారు కొనుక్కుందాం - మనకేం ? ముగ్గురు సంపాయిస్తున్నారాయే. ఎంచక్కా మీరిద్దరూ ముందూ, మేమిద్దరం వెనక. అహ నేనూ, జ్యోతీ వెనక. అహ అదీబాగోలేదు. ఎలా కూర్చుందా మంటారు చెప్పండి ?"

వెఱ్ఱిగా చూస్తున్నాడు రాజారావు. అతనికి మతిపోతోంది.

"అయ్యయ్యో నా మతిమండా! స్టౌమీద పప్పు మాడిపోయినట్టుంది. మీకు రావడంలేదూ వాసన" అంటూ అతని ముఖాన్ని స్టౌమీద పప్పులాగే మాడ్చేసి లోనికెళ్ళిపోయింది ఛాయ.

* * *

"ఈ మధ్య మీరు మరీ డల్‌గా వుంటున్నారు. అసలు జ్యోతి కబుర్లు కూడా చెప్పడంలేదు" అతని ప్రక్కన పడుకుని, అతని వెంట్రుకలతో అల్లరిగా ఆడుకుంటూ అంది ఛాయ.

నీరసంగా నవ్వాడు రాజారావు. ఛాయ అన్నట్టు అతనిలో ఈమధ్య కాస్తంతకూడ ఉత్సాహం లేదు. జ్యోతితో గడపాలని, జ్యోతి కబుర్లు

ఛాయకు చెప్పాలనికాని అతనికన్పించడంలేదు. ఎంతసేపటికీ తన భార్య లోని మార్పే అతనిని కలవరపెడుతోంది తన భార్య అమాయకత్వంతో, తను చెప్పిన పాఠాలతో నైతికంగా పతనం కాబోతున్నట్టు, ఆ ఊబినుండి తన భార్యను తను రక్షించుకోవాలన్నట్టు ఎప్పుడూ ఆలోచిస్తున్నాడు అతనికీమధ్య బొత్తిగా శాంతిలేదు. జ్యోతిదగ్గరకీ వెళ్ళడంలేదు. ఛాయ తోనూ మునుపటిలా వుండలేకపోతున్నాడు.

"ఛాయా! ప్లీజ్! నాకు దూరమైపోతావా నువ్వు?" అని హఠాత్తుగా తనను అంటుకుపోయిన భర్త తలమీద చెయ్యివేసిన ఛాయ కళ్ళనిండా నీళ్ళు.

* * *

గుడ్డలు సర్దుకుంటున్న ఛాయతో అన్నాడు రాజారావు.

"ఛాయా! త్వరగా వచ్చెయ్. నాకు తోచదు నువ్వు లేకపోతే"

ఛాయ ఫ్రెషప్ అయి ఒక సెకండ్ అతని కళ్ళల్లోకి గుచ్చినట్టు చూసింది.

"అలాగే! నాకు మాత్రం అక్కడేం తోస్తుందండీ. మీరు కృష్ణతో జ్యోతితో మాట్లాడి, మనకి మంచి ఇల్లుచూసి నాకు కబురుపెట్టండి, వెంటనే వచ్చేస్తాను. ఎంతదూరమని మా ఊరు నెక్స్ట్ స్టేషనేగా!"

రాజారావు మాట్లాడలేదు. 'ఎంత ఈజీగా మాట్లాడుతోంది ఛాయ' అతనికి ఛాయ తనకి అందనంత దూరమైపోతున్నట్టు అన్పిస్తోంది.

'అలాగే నువ్వు, నేను, జ్యోతి, కృష్ణ అంతా కలిసే వుందాం' అని

హృదయపూర్వకంగా చెప్పే ఛాయ తనకొద్దనిపిస్తోంది. జ్యోతి కబుర్లు చెపితే అసూయగా చూసే ఛాయే కావాలనిపిస్తోందిరోజు.

ఆమె జీవితాన్ని తేలిగ్గా తీసుకునే కొంది, అతను జీవితంగురించి లోతుగా ఆలోచిస్తున్నాడు.

* * *

"చూడండీ మీకు తోచకపోతే జ్యోతిని పిలిపించుకోండి."

రైల్లో తన సామాను సర్దుకుంటూ సర్దుకుంటూ మధ్యలో మాట్లాడు తోంది ఛాయ.

రైలు చిన్నగా కదిలింది.

అతను దూరమైపోతున్నాడు.

'మీ ఆరోగ్యం జాగ్రత్త' అనే ఆఖరిమాటలు చెప్పలేదు ఛాయ పైగా –

"మర్చిపోకండేం. కృష్ణతో, జ్యోతితో మాట్లాడి కబురు పెట్టండి వస్తాను" అంది గట్టిగా.

ఆమె ప్రవర్తన అతన్ని కృంగతీస్తోంది.

"ఆఫీస్ వదిలేక అక్కను స్టేషన్‌లో వదిలి రండి" అన్న జ్యోతి ఆహ్వానాన్ని మన్నించేశక్తి లేనివాడిలా నేరుగా తన ఇంటికే వెళ్ళాడు. ఆ ఇల్లు చాలా శూన్యంగా వుంది.

* * *

"ఇదీ మమ్మీ జరిగింది. ఇక జరిగేదానికొరకు నేను ఎదురుచూడా లంతే." దిగులుగా చెప్తున్న కూతురువంక ఆందోళనగా చూసింది వర్ధనమ్మ.

"నువ్వు చాలా సాహసం చేసావేమో అన్పిస్తోంది ఛాయా !"

"లేదు మమ్మీ ! ఇది సాహసమని నేననుకోవడంలేదు. ఎలాగూ

జ్యోతిని పెళ్ళిచేసుకున్నాక వాళ్ళ సంసారం చూస్తూ నేను అక్కడ వుండ లేను. అందుకే నా అదృష్టాన్ని పరీక్షకు పెట్టాను మమ్మీ."

"ఏమో ఛాయా ! అతనంటే మగాడు, నిన్ను అతను అపార్థం చేసుకుంటే కష్టమే."

"నువ్వూ అలాగే మాట్లాడుతున్నావా మమ్మీ."

వర్ధనమ్మ మాట్లాడలేదు. ఆమె మగవారిగురించీ, ఆడదానిగురించీ, వాళ్ళ వాళ్ళ అవకాశాల గురించి ఆలోచించడంలేదు. తన కూతురి భవిష్యత్తు ఏమైపోతుందోనని విచారిస్తోంది.

"పోనీ ఛాయా ! ఆ పిల్ల సాత్వికురాలని చెపుతున్నావు కదా ? ఆ అమ్మాయినే నువ్వు బ్రతిమలాడుకుని నీ బాధ చెప్పుకోన్నుండుంటే బాగుండేది !"

చాలా అసహనంగా, అడ్డంగా తల ఊపింది ఛాయ.

"నో. మమ్మీ అది నాకిష్టంలేదు."

చిరాగ్గా చూసింది వర్ధనమ్మ.

"ఇష్టం లేదనుకోవడానికి ఇది జీవితం, తినే పదార్థంకాదు. అంత అభిమానాలు పనికిరావు .... జీవితాలు సవ్యంగా నడవడానికి."

దిగులుగా చూసింది ఛాయ. ఆమె కళ్ళనిండా నీళ్ళూరాయి.

"లేదమ్మా. నేను అభిమానాలకి పోవడంలేదు. అలా జరిగేవుంటే నేను జ్యోతిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానని అతను చెప్పిననాడే, ఆ అసహ్యంతో, ఆ విరక్తితో అభిమానపడి నీ దగ్గరకొచ్చేసుందును. నా జీవితాన్ని బాగుచేసుకోవడానికే మమ్మీ నేను ప్రయత్నిస్తున్నాను."

"ఇదా ? బాగుచేసుకోవడమా ?"

"మమ్మీ! బహుశ నేను జ్యోతిని బ్రతిమలాడితేనో, భయపెడ్తేనో ఆ పిల్ల ఈ పని మానుకోవచ్చు. కానీ జ్యోతి అతన్ని కాదన్నంత మాత్రాన మగవాడి మనసుకు నచ్చే ఆడపిల్లలు మన ఆంధ్రదేశంలో కరువయ్యారా మమ్మీ."

కూతురి కంఠంలో కదలాడిన బేలతనానికి కరిగిపోయిందామె.

"పోనీలే బాధపడకు ఎలా జరగాల్సి వుంటుందో అలా జరుగుతుంది" కూతురివైపు జాలిగా చూస్తూ, కూతురి కన్నీళ్ళు తుడుస్తూ అంది. కానీ ఆమె మనస్సు వెయ్యి శంకలతో వేసారిపోతోంది.

"అతనువచ్చి, నేను జ్యోతిని పెళ్ళి చేసుకోబోతున్నాను. నీ ఇష్టం నువ్వేలా అయినా తెల్లారు" అని వెళ్ళిపోతే ఏం చేస్తావే?"

"పోనీలేమ్మా. నన్ను వద్దనుకునేంతగా అతను నానుండి దూరమైపోతే బలవంతపు కాపురం నాకేం సుఖంనిస్తుంది. నేను అతనికి దూరమైపోతున్నాననే పశ్చాత్తాపంతో నన్ను పిల్చుకుపోవాలని వస్తే - అప్పుడు మాత్రం తప్పకుండా వెళ్ళిపోతాను మమ్మీ" అని తన ఒళ్ళో వాలిపోయి పసిపిల్లలా ఏడుస్తున్న పాతికేళ్ళ కూతుర్ని పొదివిపట్టుకుని తనూ ఏడ్చేసింది వర్ధనమ్మ.

* * *

"ఛాయా!"

వంటింటి ప్రక్కగదిలో కాళ్ళు ముడుచుకుని నిరాసక్తంగా కూర్చొన్న ఛాయలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది ఆ పిలుపుతో. ఆ బాంధవ్యంలో ఎంత మహత్తుంది!

గబగబ ఎదురొచ్చి మామూలు ప్రకారం భర్తను చుట్టుకుపోబోయిన

ఛాయ అల్లంత దూరంలోనే స్పృహ తెచ్చుకున్నదానిలా ఆగిపోయి, ముఖంలో ఆనందాన్ని, సంబరంగా మార్చుకుని అంది.

"వచ్చేసారా ? అబ్బ బోర్ కొట్టి చచ్చిపోతున్నాననుకోండి. మనకు ఇల్లు కుదిరిందా ? కృష్ణ, జ్యోతి ఏమన్నారు ?"

తనకెదురుగా ఆనందంగా వచ్చిన భార్యను ప్రేమగా చూసుకుంటున్న రాజారావ్ ముఖం నల్లగా మాడిపోయింది.

"నిన్ను తీసుకుపోదామని వచ్చాను ఛాయా !" నీరసంగా అన్నాడు.

"అలాగే వచ్చేస్తాను కానీ" అని ఆగి, అమ్మ వుందేమో చుట్టూ అటూ ఇటూ చూచి,

"కృష్ణ ఒప్పుకున్నాడా ?" అంది తగ్గు స్వరంతో.

రాజారావు ముఖం మరీ నల్లగా అయిపోయింది.

ఛాయ అతన్ని ఎంత రెచ్చగొడుతున్నా అతనికి ఛాయమీద కోపం రావడంలేదు. తను చేసిన పొరపాటు కొండంతగా అతనికి స్పష్టంగా కన్పిస్తూనే వుంది. నిజానికి రాజారావు చాలా మంచివాడు. తనెన్ని తప్పులు చేసినా తన భార్య పతివ్రతగా వుండాల్సిందే అనుకునే మగజాతికి ప్రతినిధి కాడతను.

"రాత్రికి మాట్లాడుకుందాం ఛాయా, అలసటగా వుంది."

"సార్రీ. స్నానం చేస్తారా ?"

"ఆఁ"

ఛాయ లోపలికెళ్ళిపోయింది. భర్తకు బక్కెట్టు కడిగి వేణ్ణీళ్ళు పెడుతున్నా, సబ్బు, టవలు సిద్ధం చేస్తున్నా — అతనికి భోజనం పెడ్తున్నా,

'ఇంకా ఎంతకాలం ఆడాలి ఈ నాటకం? దీనికి ఈ రోజన్నా తెర పడ్తుందో లేదో అన్ని వేదన పడిపోతోంది ఛాయ.

* * *

"ఏవండీ మాట్లాడరూ! చెప్పరేం జ్యోతి, కృష్ణ ఏమన్నారు? ఇల్లు దొరికిందా?"

రాజారావు చాలాసేపటికి పెదవి విప్పాడు.

"ఛాయా! నాకు జ్యోతివద్దు .... నువ్వు కావాలి ఛాయా?"

ఛాయ గుండెలనిండా ఆనకట్టపడనంత ఆనందం. విజయం సాధించిన గర్వం. 'నేను మోసపోలేదు. నా నమ్మకం అవమానించబడలేదు' ఆమె గుండె సంతోషంతో గంతులేస్తోంది.

"ఛాయా!" తదేకంగా అతని కళ్ళల్లోకి చూస్తున్న భార్యను కుదిపాడు రాజారావు.

"ఏమంటున్నారు? జ్యోతివద్దా? మరి ఆమెకు మాటఇస్తిరే?" భర్త కళ్ళల్లోకి రియాక్షన్ కొరకు వెతుకుతూ అంది ఛాయ.

"నేను జ్యోతిని కన్విన్స్ చేసుకుంటాలే ఛాయా? నువ్వు నా కొరకు మాత్రమే బ్రతకగలవా? కృష్ణారావుని మర్చిపోగలవా?"

ఛాయ హఠాత్తుగా అతన్ని అల్లుకుపోయి బావురుమని ఏడ్చేసింది.

"వస్తాను .... వస్తాను తప్పకుండావస్తాను. నాకు కృష్ణారావు వద్దు, అమ్మవద్దు, అన్నవద్దు, నాకు నాకు మీరే .... మీరే కావాలి. సంపూర్ణంగా కావాలి మనమధ్య ఏకెవ్వరూవద్దు. నావల్లకాదు .... నేను .... నేను సహించలేను."

"ఛాయా!"

"కృష్ణారావే కాదు, ఈ ప్రపంచంలో ఏ మగాడూ మీరిచ్చే నిండు తనాన్ని నిజమైన సంతోషాన్నీ నాకివ్వలేడు. ఏ మగాడిలోనూ నాకు ఆకర్షణ కనిపించదు."

"ఛాయా ! లేమ్మా ప్లీజ్. అలా వణికిపోతున్నావేంటి ?" .... అత నామెను పొదివి పట్టుకున్నాడు!

"నన్ను వదలకండి ఒక్క క్షణంకూడా నాకు దూరమైపోకండి. మీరు లేందే నేను బ్రతకలేను. పరాయి ఆడపిల్లల్లో మీకు ఆకర్షణ కన్పించొచ్చు. దానిని తప్పని నేననను. కానీ మీకు నేనున్నాను. నన్ను కాదని నా స్థానం లోకి ఎవర్నీ తీసుకురాకండి."

"అలాగే ఛాయా ! ఏడవకు ప్లీజ్ నేను చూడలేను."

చప్పున తలకాస్త ఎత్తి అతని ఛాతిమీదనుండి మెడ పైకెత్తి చూసింది ఛాయ.

ఆమెకి అతనికళ్ళల్లో పూర్వపు ఆప్యాయత, ఆరాధన కన్పించాయి తృప్తిగా మరలా అతని ఛాతిమీద వాలిపోయి అంది ఛాయ.

"రాజా ! నీకొకవేళ ఏ ఆడపిల్లలోనైనా ఆకర్షణ కనిపిస్తే ప్లీజ్ దానిని ఆపుకోవడానికి ప్రయత్నించు. లేదా ఆ విషయం నాకు చెప్పకు ఇంకోసారి నేను భరించలేను నావల్లకాదు"."

అతను మాట్లాడలేదు. మృదువుగా, ప్రేమగా ఆమె తల నిమురు తున్నాడు. ఆ స్పర్శ ఆమెకు తనకు కావాల్సిన జవాబిచ్చింది.

"ఛాయా ! నువ్వు కృష్ణారావుకి ఏమి సంజాయిషీ చెప్పుకోనవసరం లేదు. నేను చెప్పుకుంటాను మన వూరికి ఎప్పుడెళ్దాం ఛాయా ?"

కృష్ణారావు ప్రసక్తి రావడంతో అయిష్టంగా కదిలింది ఛాయ.

"కృష్ణారావుకి సంజాయిషీ చెప్పుకోవాల్సిన పనిలేదు. అతను నాకే

మవుతారని ? ఊరికే .... ఊరికే నాటకమాడానంతే" కాస్త తగ్గు స్వరంతో అన్న ఛాయమాటలు రాజారావు గుండెల్లో పన్నీటిజల్లులా కురిసాయి. అతనిలో ఇంకా మిగిలిన భారం దూదిపింజంలా ఎగిరిపోయింది.

"ఛాయా ! ఛాయా ! ఛాయా !"

అతని గుండెలు ఛాయను ప్రియంగా పిలుస్తూనే వున్నాయి. అతని చేతులు ఆమెనిక ఒక్క ఇంచైనా దూరంగా వుంచలేనట్లు ఆమెనల్లుకున్నాయి. "సారీ ఛాయా !"

* * *

మర్నాడు ప్రొద్దున పసిపిల్లలా పరుగెత్తుకుంటూ వచ్చి తల్లిని చుట్టేసింది ఛాయ.

"మమ్మీ నేను గెలిచాను మమ్మీ" తృప్తి, తొణికే సంతోషంతో అంది ఛాయ.

కూతురివైపు సంతోషంగా, ప్రేమగా చూసిందామె.

"ఆంధ్రదేశంలో ఆడపిల్లలంతా ఛాయలైతే మరీ మగాళ్ళలా ఆటలాడరు మమ్మీ" కించిత్ గర్వంగా అంటున్న కూతుర్ని చూస్తూ 'ఈ సిద్ధాంతం మంచిది కాదన్న'ట్టు తల అడ్డంగా ఊపింది వర్ధనమ్మ.

"అందరూ ఛాయలు కాగలరేమోగానీ, అందరూ రాజారావులు కాలేరు" కూతుర్ని చంటిపిల్లను చూస్తున్నట్టు చూస్తూ అంది వర్ధనమ్మ.

"అంటే...."

"అంటే ... అంటే పిచ్చితల్లీ! నా అల్లుడి స్థానంలో మరెవరైనా వుండుంటే ....'కృష్ణను ప్రేమిస్తున్నాను' అని నువ్వన్న మరుక్షణం నిన్ను ఇంట్లోనుండి తరిమేసేవాడు. లేదా నిన్ను హత్య చేసుండేవాడు."

"అంటే.... మమ్మీ ! నువ్వు రాజా చేసినదాన్ని సమర్థిస్తున్నావా ?" సీరియస్‌గా దిగులుగా అడిగింది ఛాయ.

నిట్టూర్చింది. వర్ధనమ్మ. ఆ నిట్టూర్పులో 'మగసమాజం ఇదీ' అనే వ్యాఖ్యానంతోపాటు తన అల్లుడు తన బిడ్డను స్వీకరించిన ఆనందమూ వుంది.

"లేదమ్మా ఛాయా ! అలా పరాయి ఆడపిల్లవల్ల ఆకర్షించబడే ప్రతి మగాడిదీ తప్పే. కానీ మన రాజాలా తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడే వ్యక్తులు ఎంతమందుంటారు చెప్పు ?"

"అల్లుణ్ణి వెనకేసుకొస్తున్నావు మమ్మీ" అని తృప్తిగా నవ్వి,

"నిజమే: నువ్వన్నదీ నిజమే. కానీ, ఆడపిల్లలు అసలు ఇలాంటి విషయాల్లో కన్నీళ్ళు కార్చడంతప్ప ఎదుర్కోవడానికి భయపడుతున్నారు. భర్త తప్పుల్ని అందరి దగ్గరనుండీ దాచుకుని తన గౌరవాన్ని కాపాడుకోవడానికే ప్రయత్నిస్తున్నారుగానీ, అతని తప్పుల్ని అతనికి తెలియజేసేందుకు సంకోచిస్తున్నారు. ఏమంటావ్ మమ్మీ."

నిట్టూర్చింది వర్ధనమ్మ.

"ఏమంటాను ఛాయా ! నువ్వు చెప్పేదంతా నిజమే. కానీ వాళ్ళలా పిరికివాళ్ళు కావడానికి కారణమేమిటి ? అది ఆలోచించు. అలా భర్తలను సకారణంగా ఎదిరించిన వాళ్ళను మన ఆడవాళ్ళు ఏమాత్రం ఆదరించి, ఆమోదిస్తున్నారంటావ్ ?"

"నో మమ్మీ ! ఎవరూ ఆమోదించక్కరలేదు. మన బ్రతుకులకొరకు మనం పోరాడాలి."

"అదే .... అదే నేనూ అంటున్నాను. బ్రతుకుకొరకు పోరాడాలి. కానీ బ్రతికే మార్గాలని మూసేసుకోకూడదు .... వుండు వస్తాను, అబ్బాయికి టిఫిన్ పెట్టేసి ...."

"ఆయన లేరు బయటకెళ్ళారు .... ఇది చెప్పు. ఇందులో బ్రతికే మార్గాలన్నీ మూసుకోవడమేమిటి ?"

"ఛాయా ! నీ సాహసానికి నేను కంగారుపడ్డాను మొదట. 'నువ్వు సుఖపడే మార్గాలన్నీ నువ్వే మూసుకుంటున్నావ'ని. ఆ అబ్బాయి మంచివాడు కాబట్టి తను మారి నిన్ను పిలుచుకుపోవడానికి వచ్చాడు. అలా కాక ఇంకోలా జరిగుంటే...."

"జరగనీ మమ్మీ ! నా భర్త మారని మూర్ఖుడైతే మరో స్త్రీ భర్త మారచ్చు. ఈ రోజు ఇద్దరు మారితే, రేపు మరో ఇద్దరు మారచ్చు. ఎంత కాలమని... వాళ్ళు ఎన్ని... తప్పులు చేసినా, ఎంత నిర్లక్ష్యం చేసినా, బ్రతుకుతో రాజీపడుతూ బానిస బ్రతుకు బ్రతకడం ?"

కూతురివైపు మెచ్చుకోలుగా చూసింది వర్ధనమ్మ .... తర్వాత విచారపడుతూ అంది.

"చూడూ ఛాయా ! భర్తను సకారణంగా వదిలేసి వచ్చిన భార్యను ఈ సమాజం సానుభూతితో స్వీకరించే అంత ఎత్తుకు ఎదిగేంతవరకు తల్లిగా, ఏ బిడ్డకూ నీలా సాహసం చేయమని నేను సలహా ఇవ్వలేను."

"మరలా నువ్విక్కడే పొరపడుతున్నావు మమ్మీ. ఒకసారి అందరి మనసుల్లో మార్పు రావడం సాధ్యమయ్యే పనికాదు. ఈ రోజు నేను, రేపు మరొకరు, ఎల్లుండి మరో చెల్లెలు, బ్రతుకుతో పోరాడి గెలిచినా, ఓడినా, అప్పుడు, అప్పుడు – కొందరికైనా జ్ఞానోదయమయ్యేది. అలానే కదూ మమ్మీ. ఇప్పుడు మనం ఈ మాత్రంగానైనా స్వేచ్ఛగా బ్రతగ్గలుగుతున్నాం మన ముందుతరాలవాళ్ళు రేపిన విప్లవంలో వాళ్ళు నలిగిపోయుండొచ్చు. కానీ మనం బాగుపడ్డాం. కొంతబాగుపడ్డ మనం మన ముందుతరాల వాళ్ళని మరికొంత బాగుపడనిద్దాం" అని ఆగి,

"పెద్ద ఉపన్యాసమే ఇచ్చేసాను" అని నవ్వింది ఛాయ.

"వెఱ్ఱి వెఱ్ఱి అల్లుడు ఒక్కడే వుంటాడు."

* * *

భర్తతో ఇంటికిరాగానే వాకిట్లోనే ఓ ఉత్తరం ఛాయకోసం ఎదురు చూస్తోంది.

'అపరిచితమైన వ్రాత, ఎక్కడినుండీ ఉత్తరం ?' అటూ ఇటూ త్రిప్పి చూసింది ఛాయ.

ఫ్రమ్ అడ్రసు లేదు, కవరు చింపింది.

"అక్కా !"

ఛాయకొచ్చే ఉత్తరాలే చాలా తక్కువ. ఆతృతగా పేజీ త్రిప్పి సంతకం చూసింది.

జ్యోతి —

జ్యోతి – తనకు ఉత్తరం – క్యూరియాసిటీ

—మీరారోజు – మీ ఇంటికి నేనొచ్చిన రోజు- 'నాకిష్టం లేకపోతే మీరు మావారిని పెళ్ళి చేసుకోవడం మానేస్తారా ?'అని అడిగారు. ఆరోజు నా దగ్గర జవాబు సిద్ధంగాలేదు. కానీ ఇన్నిరోజులు ఆలోచించి జవాబు సిద్ధపరచుకున్నాను నా ఆనందంకోసం మరోవ్యక్తి ఆనందాన్ని దోచుకోవడం స్పాటి అడద్దానిగా నేను చేయాల్సిన పనికాదు.

ఈ జీవితం నాకు నచ్చనిమాట వాస్తవమే. మిగిలిన జీవితంలో కాస్తయినా, సుఖపడాలని ఆశపడి రాజారావు తోడు కోరుకున్నాను. తోడు కోరుకోవడం పొరపాటని ఈనాటికీ అనుకోవడంలేదు నేను. పెళ్ళయిన రాజారావును కోరుకోవడమే నేను చేసిన పొరపాటు.

ఛాయగారూ ! రాజారావుతో భవిష్యత్తును చాలా రకాలుగా ఊహించుకున్నాను, ఆశపడ్డాను, ఆనందపడ్డాను. నిజమే.... కానీ నా పరిస్థితిలో నాకు నిజమైన తోడుగా నిలుస్తానన్న ఏ మగాడినైనా నేనిష్టపడే వుందును.

మీరలా కాదు. అతను మీకు జీవితాంతం స్వంతం అనుకున్నారు. దానికి తిరుగులేదు. మీకు మరో ఊహ లేదు, మరో ఆశలేదు అతడుతప్ప మరో ఆలోచనలేదు. అట్లా స్థిరపడ్డ జీవితం మీది.

మీరీమధ్య అమ్మగారింటికి వెళ్ళారు — మీరెంత వ్యథపడి వెళ్ళారో ఊహించగలను. అందుకే ఈ నిర్ణయం. కొంతకాలం రాజారావు జ్ఞాపకాలు నన్ను బాధపెడతాయి. కానీ కాలం గాయాన్ని మాన్పేస్తుంది. ఒక రోజుటికి రాజారావుని రాజారావులాగే చూడగల స్థితికి వచ్చేస్తాను నేను. అప్పుడు ఒకవేళ మరెవరైనా నన్ను తమ జీవితంలోకి ఆహ్వానిస్తే, ఇప్పుడు ఆ ఊహ భరించరానిదిగా వుంది కానీ గాయం మానిన ఆ రోజు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే నాకూ మరలా సుఖపడాలనిపిస్తుంది. ఇంటికెళ్ళేసరికి కబుర్లు చెప్పుకొని, కలిసి భోంచేసే తోడు కావాలనిపిస్తుంది. అప్పుడు నన్ను మెచ్చిన మనిషి, నాకు నచ్చే వ్యక్తి తారసపడితే నా జీవితాన్ని మరలా నిర్మించుకుంటాను. కానీ ఈసారి చేసిన పొరపాటుమాత్రం అప్పుడు చేయను.

కొన్ని రోజులు పోయాక మన ముగ్గురిలో ఆవేశాలు, కోపాలు, సానుభూతులు, వ్యధలు ఆరిపోయాక - మనం ఒక్కసారి కలుసుకుందాము.

రాజారావుకీ విషయం చెప్పండి. ఆఫీస్‌కొచ్చాక నేనూ చెప్తాను—

చాలాసేపు అలాగే తెరిచిన ఉత్తరాన్ని మూయకుండా కూర్చుంది ఛాయ.

"పాపం జ్యోతి !"

"జ్యోతికిష్టంలేనిజీవితంలోనుండి, ఆమెకిష్టమయ్యే జీవితంలోకి ఆమెను పంపాలి, తను అందుకు ప్రయత్నించాలి. ప్రతిమనిషికీ సుఖపడే హక్కు వుండాలి."

ఇంకా, అలాగే కూర్చుని ఆలోచిస్తోంది ఛాయ.